# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా

ఫోన్: (0863) 2293645, 2293862, 2293280, 2293206, 9299656267

web: www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com



సంపాదక వర్గము

**గూడూరి వెంకటరత్నం**

**డి.జె. బాలకృష్ణ లాల్**

**డా॥ ఎస్.రామతారక పరబ్రహ్మశాస్త్రి**

**మిస్.పి. ఇందిరాదేవి**

**డా॥ వి.వి.ఆర్. ప్రసాదరావు**

**డా॥ యమ్.స్వర్ణముఖి**



Volume 31 Issue 1

No.of Pages 40

SEPTEMBER 2011

| | | |
|---|---|---|
| 5సం॥ల చందా | రు. | 250.00 |
| 2సం॥ల చందా | రు. | 120.00 |
| సంవత్సర చందా | రు. | 60.00 |
| విడిప్రతి వెల ..... .. | రు. | 5.00 |

బ్యాంక్ డ్రాఫ్ట్ A/C.Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్ పేరులో డ్రా చేయండి. M.O.,బ్యాంక్ డ్రాఫ్ట్ పంపవలసిన చిరునామా:

మేనేజరు

సమర్థ సద్గురు మాగజైన్

శ్రీకాళీగార్డెన్స్-522508

Printed, Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL


## ఈ సంచికలో.... పేజీ


| | |
|---|---|
| భద్రవాక్యం | 2 |
| అమ్మ ఆశీస్సులు | 3 |
| బాబూజీ ఉవాచ | 4 |
| మాతాజీ అభిభాషణ | 6 |
| సన్నిధిలో సంభాషణ | 9 |
| శ్రీకాళీగార్డెన్స్‌లో కార్యక్రమాలు | 11 |
| శ్రీగురుదక్షిణ | 13 |
| గురు కృపాహి కేవలమ్ | 15 |
| శ్రీకృష్ణ కర్ణామృతం | 18 |
| పరిప్రశ్నేన సేవయా | 20 |
| సర్వరోగ హరులు | 22 |
| బాబూజీ రాజయోగి | 24 |
| భగవత్సాక్షాత్కారము | 25 |
| శ్రీకృష్ణాష్టమి వేడుకలలో శ్రీమాతాజీ అనుగ్రహభాషణ | 27 |
| సమర్థ సద్గురు నాథుని దివ్యచరిత్ర | 29 |
| మౌనధ్యాన శిబిరం | 32 |
| సద్గురువే భగవంతుడు | 34 |
| అమెరికాలో మాతాజీ బోధ | 36 |
| శ్యామసుందరా! ఒక్కసారి! | 38 |

# భద్రవాక్యం

-పరాశర ప్రసాద్

**గభీరే కాసారే విశతి విజనే ఘోరవిపినే**
**విశాలే శైలేచ భ్రమతి కుసుమార్థం జడమతిః**
**సమర్ప్యైకం చేత స్సరసిజ ముమానాధ భవతే**
**సుఖౌ నావ స్థాతుం జన ఇహ నీ జానాతి కిమహో**

- శివానందలహరి

**ఏకంసత్ విప్రా బహుధా వదన్తి** అని శాస్త్రాలు చెబుతున్నాయి. దైవపూజ నిమిత్తము స్నానంచేసి, మడిబట్టలు కట్టుకుని, విభూతి కుంకుమ, నామాలు ముద్రాధారణ చేసి, వేదమంత్రాలతో విగ్రహాలకు ధ్యాన, షోడశోపచారాలను చేయడాన్ని దేవతార్చన అంటారు.

దేవుడంటే కేవలం దేవాలయాలకు, విగ్రహాలకు మాత్రమే పరిమితమై లేడు. మన కంటికి ఆనందాన్ని కలిగించే చెట్లు, సూర్య చంద్రులు, నదులు, తీర్థ క్షేత్రాలు, శిశువులు, బిచ్చగాళ్ళు అందరూ భగవత్స్వరూపులే. పూజల పేరుతో ఆర్భాటం చేసి, లక్షలు ఖర్చు చేస్తారు. బాహ్యాడంబరాలకు తావివ్వక మంచి మనస్సుతో అందరిని ప్రేమించి ఆపదలో ఉన్న వారిపట్ల సానుభూతి కలిగి మనకున్న విద్య, ధనం, ఇతరులకు పంచటం పూజకాదా! పూజకు ప్రధానమైనది ప్రేమ భక్తి.

శంకర భగవత్పాదులవారు దానినే తెలియజేస్తూ మానవుడు మందమతియై పూలకోసం లోతైన చెరువులలో దిగుతున్నాడు. అంతే కాదు భయంకర అరణ్యాలలో ప్రవేశించి కొండలు, గుట్టలు వెదకి శ్రమపడుతున్నాడు. తన మనసనెడి పుష్పాన్ని దైవానికి సమర్పించి శాంతిని పొందలేకపోతున్నాడు.

మనస్సుని శాశ్వతంగా విషయాదులకు అర్పించాడు. విషయాదులు మనస్సుని తిరిగి యిస్తాయని నమ్మకం లేదు. మనోపుష్పాన్ని స్వాధీనపరచుకుని, భగవదర్పణ చేసేవరకు గీతలో చెప్పినట్లు పత్రం, పుష్పం, ఫలం, తోయం ద్వారా భగవంతుని పూజించక తప్పదు కదా! మనోపుష్పంతో పూజించు నేర్పు సంపాదించిన వారు ధన్యులు గదా!

**పరాశర ప్రసాద్**
**గౌరవ సంపాదకులు**

# అమ్మ ఆశీస్సులు

**'ప్రణవ స్వరూప వక్రతుణ్డ'** అని కీర్తనలో ఉంది. శ్రీగణేశ చతుర్థి వచ్చింది. ప్రణవమే స్వరూపంతో ఉన్న శ్రీవిఘ్ననాయకునితో ఈ నెల మొదలైంది. శ్రీవినాయకుని పూజ చేసుకుని ఆ ఉపాసనతో ఉన్నవారికి వారి వారి కార్యక్రమములన్నీ నిర్విఘ్నంగా కొనసాగుతాయి. ప్రథమ పూజ్యుడైనాడు. ఏపని మొదలు పెట్టినా స్వామిని తలచుకునే ముందుకు వెళతాం కదూ! ఎంతో సులభంగా తేలికగా అందుతాడు.

పత్రితో పూజిస్తే చాలు. అలంకారమయితే మన ఇంటి చుట్టూవి, వంట గదిలోవి కూరలతోను, పాలవెల్లి కడితే సరి. నైవేద్యం అయితే గుడ 'బెల్లం'తో మొదలు పెట్టి మన ఇష్టం ఏది పెట్టినాసరే అనుగ్రహించేవాడు. ఏ ఒక్కటి మనసారా అర్పించుకున్నా చాలు. సంతుష్టుడైపోతాడు. అధ్యాత్మిక దృష్టితో మాత్రమే గుర్తిస్తే **'త్వం మూలాధార స్థితోzసి నిత్యం'** అన్నది ఉపనిషత్తు. మూలాధార చక్రము నందు స్థిరుడై మనలో ఉన్న నరనరములకు గణములకు గణాధిపతియై తత్త్వము తెలిసినా, తెలియక పోయినా సర్వసృష్టిని ప్రకాశింపజేస్తున్నవాడని. తెలుసుకున్నవాడు ధన్యత చెందుతున్నాడు.

అందుకనే భద్రంగా భాద్రపద మాసమందు పార్వతీ పరమేశ్వరులకు పుత్రుడై అంతేకాక ఎంతో వినయంతో వారిని పూజించి ప్రదక్షిణ చేయడంతో విఘ్నాధిపతి అందరిచేత పూజింప బడుతున్నాడు.

భాద్రపదం పూర్తి అయ్యేసరికి ఆశ్వయుజ మాసం మొదలు శ్రీదేవీ శరన్నవరాత్రి మహోత్సవములు మొదలవుతున్నవి. శ్రీజగన్మాతనిర్హేతుక జాయమాన కరుణను ప్రసాదించే తల్లి.

**శరణాగత దీనార్త పరిత్రాణ పరాయణే సర్వస్యార్తి హరేదేవి నారాయణీ నమోzస్తుతే** శ్రీజగన్మాతను శరణు పొందిన దీనుల స్వరబాధలను హరింపజేసే శ్రీనారాయణికి నమస్కరిస్తూ అట్టి శ్రీసద్గురుదేవుల దివ్య అనుగ్రహమును మనమందరము పొందుదుము గాక.

శ్రీసద్గురుదేవుల సేవలో.....
మీ అమ్మ

# బాబూజీ ఉవాచ

- వెంకట రమణ ప్రసాద్

కొంతసేపటికి వ్యాసమహర్షి తిరిగి వచ్చాడు. రచన కొనసాగించబోతూ, వ్రాసినది తిరిగి చదివేటప్పటికి, తాను వ్రాసిన దానిని ఎవరో మార్చటం గ్రహించాడు. దివ్యదృష్టి ద్వారా ఆ పని చేసినది జైమిని అని తెలుసుకుని తనలో తాను నవ్వుకున్నాడు.



కొన్ని నెలలు గడిచాయి. వర్షాకాలం వచ్చింది. జైమిని తన కుటీరంలో తాను వ్రాయబోతున్న వ్యాఖ్యానాన్ని గురించి ఆలోచించుకుంటూ పడుకున్నాడు.

ఇంతలో చలిగాలి వీచటమూ, దానితో పెద్దపెద్ద చినుకులతో వాన కురవటమూ మొదలైంది. ఇంతలో తడిసిపోయి, శరీరాన్ని అతుక్కుపోయిన చీరతో ఒక యౌవనవతి ఆయన కుటీరంలో ప్రవేశించింది. మహాసౌందర్యవతి అయిన ఆ యువతి యౌవనాన్ని ఆ తడిసిన చీర కప్పి ఉంచలేకపోయింది. ఆమె సౌందర్యానికి ఆకృష్టమైన జైమిని ఆమె నుండి తన కళ్ళను మరల్చలేకపోయాడు. అతని కళ్ళు కామాగ్నితో కణకణ మండే చంద్ర నిప్పులవలె ఎఱ్ఱబడ్డాయి.

ఆ స్త్రీ కూడ తన విలాస లాలస నయనాలతో అతడిలోని కాంక్షను రెచ్చగొట్టింది. మరుక్షణమే జైమిని తానెక్కడున్నాడో, ఏం చేస్తున్నాడో తెలియని తమకంతో ఆమెను ఆలింగనం చేసుకున్నాడు. ఆ సుఖపారవశ్యంలో జైమిని కన్నులు సహజంగానే మూతబడ్డాయి.

అలా ఎంతసేపు మోహితుడై ఉన్నాడో గాని, ఉన్నట్లుండి తన ఛాతీపై ఏదో గుచ్చుకున్నట్లు తోచేటప్పటికి స్పృహలోకి వచ్చాడు జైమిని. కనులు తెరచి చూసేటప్పటికి తనకు గుచ్చుకొన్నవి శ్రీవ్యాసుల శ్మశ్రువులని తెలిసింది. తాను కౌగలించుకున్నది యౌవనవతినికాదు తన గురుదేవులు వ్యాసమహర్షిని. సిగ్గుతో చితికిపోయాడు జైమిని. కాని వ్యాసుల పెదవులపై తొణికిసలాడిన మధుర మందహాసం జైమినికి వెంటనే జ్ఞానోదయం

కలిగించింది.

"స్వామీ! నా తప్పును నాకు స్వయంగా తెలియజేసారా? ఎంత దయామూర్తి మీరు!" అంటూ వ్యాసులవారి పాదములపై పడ్డాడు జైమిని. వ్యాసులు జైమినిని ప్రేమతో కౌగలించుకుని వీపు నిమిరారు. తరువాత జైమిని "బలవాన్ ఇంద్రియగ్రామో విద్వాంసమపి కర్షతి" అని వ్యాసులు వ్రాసినట్లుగానే తిరిగి శ్లోకపాదాన్ని దిద్ది ప్రపంచానికి ప్రసాదించాడు.

అలా జైమినివంటి సాధకుడూ, పండితుడూ క్షణంలో ఇంద్రియాల మాయకు లోనైతే, ఇక సామాన్యుల గతి యేమిటి?

కాని అమాయకులైన బృందావన గోపికల దరిదాపులకు కూడా వెళ్ళలేకపోయింది మాయ. వాళ్ళు తమనుతాము శ్రీకృష్ణప్రభువుకు పూర్తిగా అర్పించుకొని శరణాగతి చెందటం వల్లనే మాయ వాళ్ళను స్పృశించలేక పోయింది.

అందువల్లనే భీష్మాదులు, గోపికలను పరమ జ్ఞానులుగా భావించేవారు. "**మామేవ యే ప్రపద్యన్తే మాయామేతాం తరన్తి తే**" అన్న భగవంతుడి వాగ్దానానికి పరమైన సాక్ష్యమే గోపికలు.

ఇంద్రియాలకూ, మానవుడికీ ఉన్న సంబంధాన్ని తెలియజేస్తూ కఠోపనిషత్తు ఒక చక్కని ఉపమానాన్ని వాడుతుంది.

మానవ శరీరం ఒక దివ్యమైన రథం. మనస్సు రథికుడు. బుద్ధి రథచోదకుడు. ఇంద్రియాలు దేహ రథాన్ని లాగే అశ్వాలు. ఇంద్రియాశ్వాలు సుఖలాలసతో దేహరథాన్ని తలో దిక్కూ లాగుతాయి. ఈ గుర్రాలను అదుపు చెయ్యలేని మనస్సనే రథికుడు అవిద్యారణ్యంలో దోవతప్పి యిడుముల పాలవుతాడు. కాని బుద్ధి అనే రథచోదకుడు సమర్థుడైతే, అశ్వాలను అదుపులోకి తెచ్చి, వాటి ద్వారానే గమ్యస్థానమైన మోక్షసామ్రాజ్యాన్ని అతి త్వరలో చేరగలుగుతాడు. అందుచేత ప్రతి మానవుడూ విచారశీలియై, ఇంద్రియాలను అదుపులో ఉంచుకొని ధ్యేయాన్ని సాధించాలి.

■

# మాతాజీ అభిభాషణ

(గత సంచిక తరువాయి) -జపమాల ప్రసాద

## 12. చిన్న విత్తనంలో అంత చెట్టు ఉందా?

(పూర్వ విభాగ్-శ్రీదత్త మందిర్ దేవస్థానం షోలాపూర్ 6.12.2003 శనివారం రాత్రి 7.20)



"లక్ష్మి విలాసాస్పద పాదపద్మమ్
శృత్యంత కాంతా శిరసో విభూషమ్
త్వామేవ నిత్యమ్ శరణాగతోహమ్
శ్రీదత్త మే దేహి కరావలంబమ్"

"లక్ష్మీదేవి నిరంతరం సేవించే పాద పద్మములు, ఉపనిషత్కాంత శిరస్సుకి భూషణాలంకారమైనవి గురు పాదపద్మములు. అటువంటి ఓ గురుదేవా! నీవొక్కడవే నిత్యమైన వాడవు; నిన్ను శరణు పొందుతున్నాను స్వామీ! శ్రీదత్తా! నీ చేయూతనిచ్చి నన్ను రక్షించు అని అర్థిస్తున్నాను." సద్గురు దేవుల దివ్యపాదములు మనని తరింపచేసేవి. అట్టి గురుపాదపద్మములకి నమస్కరిస్తూ....

ఇన్ని రోజులుగా యింత చక్కగా గురుతత్వాన్ని విచారణ చేసుకుంటున్నాము. ఇక ఈ సత్సంగ సమావేశాల ముగింపు ఘట్టానికి చేరుకుంటున్నాము. ఈ సందర్భములో గురుదేవుల మాటలు గుర్తుకు వస్తున్నాయి. "మీ అందరినీ విడిచి వెళ్ళాలంటే, తల్లిఆవు నుండి దూడని వేరుచేస్తున్నట్లు - అంత బాధగా వుంది.'' మనం నిరంతరం ఇలాగే భగవన్నామామృతంలోనే మునిగిపోయి ఆనందంగా ఉంటే ఎంత బాగుంటుంది! కానీ అలా వుండలేకపోతున్నామే. ఎందుకని? మనని ఎవరు అడ్డుపెడుతున్నారు? మనకి మనమే అడ్డుపెట్టుకుంటున్నాం. మన మనస్సే మనకి అడ్డు వస్తోంది.

సద్గురునాథులు ఇటువంటి అనుభూతిని తరచూ కలిగిస్తారు. 'తరచూ' అన్నారేమిటి? ఎప్పుడూ ఈ ఆనందాన్ని ఇవ్వకూడదా అని మీరడగవచ్చు. నిజమైన ఆనందం అంటే ఇలా వుంటుంది అని చెప్తారు.

దానిని నిలబెట్టుకోవడం మన వంతు. తల్లి మనకి చిన్నప్పుడు, చక్కగా ముద్దలు చేసి తినడం నేర్పిస్తుంది. "పచ్చడిని కూరలాగా కలుపుకోకూడదు నాన్నా" అని నేర్పిస్తుంది. మనం నేర్చుకోకపోతే అమ్మ, అయ్యో తన బిడ్డ ఇంకా ఎదగలేదే అని ఎంతో బాధపడుతుంది. ప్రపంచంలో తన బిడ్డ ఎంతో పైకి ఎదగాలని కోరుకున్నా, తనముందు మట్టుకు తన బిడ్డ చంటిపిల్లవాడే అని అనుకుంటుంది అమ్మ. అలాగే గురుదేవులు మనకి నిత్యమైన ఆనందం అంటే ఎలా వుంటుందో, అది ఏం చేస్తే దొరుకుతుందో అన్నీ చక్కగా నేర్పిస్తున్నారు. దానిని నిరంతరం నిలబెట్టుకోవలసింది మనమే.

నీకు నిజమైన భగవజ్జిజ్ఞాస అనే ఆకలి కలిగితే భగవంతుని గురించి ఏడు అన్నారు స్వామివారు. కానీ మనవన్నీ దొంగ ఏడుపులే! ఎప్పుడో గుర్తుకి వస్తే ఏడుస్తాం. లేకపోతే ప్రపంచ విషయాలలో మునిగిపోతాం. సాధకుడైన వాడు 'నేను చాలా చిన్నవాడిని' అనే వినమ్ర భావన అలవాటు చేసుకుంటే, ఎంతో ఉన్నత స్థితికి ఎదగ గలడు. ఏదో కొంచెం తెలుస్తేనే, 'నాకు చాలా తెలుసు' ననుకుంటారు కొంతమంది. కానీ, అన్నీ తెలిసిన జ్ఞానులు మాత్రం, "తత్ పరిచారక భృత్యస్య భృత్య భృత్య.... ఇతి మాం స్మర లోకనాథ" అని వుంటారు. 'ప్రభూ! నన్ను నీ పరిచారకుడి భృత్యుడి, భృత్యుడి, భృత్యుడుగా వుండనీ' అని వేడుకున్నారు మహారాజయిన కులశేఖరులవారు. ఆయనకి ఏనాడూ ఆ రాజభవనాలుకానీ, రాజ్యభోగాలు గానీ రుచికరించలేదు. "ఎప్పుడు భగవంతుడిని చూస్తానా? ఎప్పుడు ఆయన కథలు విని ఆనందిస్తానా?" అనే తలచేవారు. మనంకూడా అలానే వుండాలి. వినాలి, అనాలి, ఆనందించాలి. **"మజ్జన్మః ఫలమ్ ఇదమ్ మధుకైటభారే"** - మధుకైటభులనే రాక్షసులని సంహరించిన ఓ హరీ! నాజన్మ కలిగినందుకు ఈ ఒక్కటే ఫలం - **'మదనుగ్రహ ఏష ఏవ'** నాయందు అనుగ్రహించి ఇది ఒక్కటే నాకు ఈయి. నీయొక్క పరిచారకుడి, పరిచారకుడి, సేవకుడి సేవకుడి.... సేవకుడిగా వుండి సేవ చేసుకునే భాగ్యాన్ని ప్రసాదించు ప్రభూ, అంతే చాలు' అని కోరుకున్నారు కులశేఖర మహారాజు. నవరత్న కిరీటాల మధ్యనున్న మహారాజు అలా అంటే, మనం ఎంత నేర్చుకోవాలి! అస్మద్గురుదేవులు ఈ శ్లోకాన్ని ఎప్పుడూ స్మరించేవారు. 'అలా వుండగలుగుతే చాలు, నాజన్మ సార్థకమయిందని భావిస్తాను' అనే వారు.

అణిగి వుంటే మనకి దెబ్బలు తగలవు. కానీ, భావనలో మనం గొప్ప వాళ్ళమే. అలాగని 'నేను అల్పుడని' అనే కించిజ్ఞ భావం కలిగి వుండమనడంలేదు. అది తప్పు. 'నాకన్నీ తెలుసు' అనే భావన ఎలాగయితే పనికిరాదో, 'నేను మూర్ఖుడిని' అనే కించిజ్ఞతా భావన కూడా తప్పే. ఇక్కడ కులశేఖరులవారు తమ యొక్క భగవద్భక్తిని, భాగవతారాధనా తత్పరతని తెలియచేస్తున్నారు. భగవద్భక్తుల సేవకులకి సేవ చేసుకున్నా అది భగవంతుడికే చెందుతుంది.

ఈ సర్వసృష్టిని చేసిన భగవంతుడే మనలోని ప్రతి కదలికకీ కారణం. ఇంత మనకి ప్రసాదించిన భగవంతుడికి, మనం అనుభవించేవన్నీ ఆయనకి నివేదన చేసి తీసుకుంటే, ఆయనెంత ఆనందిస్తాడు! ఒక తల్లి తన బిడ్డకోసం ఒక డబ్బా నిండా సున్ని వుండలు చేసి పెట్టి, 'ఒరేయ్ నాన్నా! ఈ సున్నుండలన్నీ నీకోసమే చేశానురా' అని అంటే, ఆ పిల్లవాడు, "అమ్మా! నువ్వు ముందు తిని, రుచి చూడవే!" నువ్వు తిన్నాకనే నేను తింటాను" అని అంటే, ఆ తల్లి ఎంత ఉప్పొంగిపోతుంది! ఆవిడ చేసేటప్పుడు రుచి చూచే వుంది కానీ తన పిల్లవాడి ప్రేమకి పరవశించిపోదా! అదేవిధంగా మనకి సర్వం ప్రసాదిస్తున్న భగవంతుడికి, కృతజ్ఞతా పూర్వకంగా మనం నివేదన చేస్తే ఆయనెంత ఆనందిస్తాడు! ఆయన ఋణం మనమెలా తీర్చుకోగలం? మన పంపులో వచ్చే నీటిని ఆయనకి నివేదన చేస్తే తీర్థమవుతోంది. పత్రం, పుష్పం, ఫలం, తోయం... అంటే ఆకుగాని, పువ్వుగాని, ఫలంగాని, చివరికి నీరుగాని ఏదయినా సరే భక్తితో ఆయనకి సమర్పిస్తే చాలు, మహదానంద పడిపోయి, మనకి అక్షయంగా ఇస్తున్నాడు. 'తను మన ధనములనిచ్చిన దాతవు నీవెకదా! కలదంతయు నీదెకదా! నీయది నీ కర్పించుట, నావిధియే కాదా నను నీలో చేర్చు కదా!' అని రోజూ పాటయితే పాడేసుకుంటున్నాము. తను మనోధనాలని ఇవ్వాలని వున్నాకూడా ఆలోచిస్తున్నాం. ఆలస్యం చేస్తున్నాం. ఎందుకని? ఇది ఎవరికి వారు వేసుకోవలసిన ప్రశ్న. ఆ భగవంతుడిచ్చినదంతా హాయిగా అనుభవిస్తున్నాం. ఇచ్చిన వాడిని మట్టుకు మరచిపోతున్నాం.

-సశేషం

# సన్నిధిలో సంభాషణ

(గత సంచిక తరువాయి) - పరాశర ప్రసాద్

31-5-1985

ఈ రోజు ఉదయం శ్రీబాబు భక్తులనుద్దేశించి మాట్లాడుతూ అంతఃకరణ శుద్ధి చెందిన మనస్సు నుండి ఉత్పన్నమైన భావాలు ఎలా ఉంటాయి? నీచ భావాలు ఉత్పన్నమవుతాయా? అని ప్రశ్నించారు.

శ్రీబాబు ఇంకా మాట్లాడుతూ జన్మజన్మాంతర పాపకర్మలను ఆచరించటం వలననే పునరపి జననం పునరపి మరణం చెందుతున్నాడు. అట్టి మానవుని మనస్సు ద్వారా వచ్చే సంకల్పాలు అన్నీ దుష్ట సంకల్పాలే. అట్టి వికారములతో కూడినది మలిన మనస్సు. అది గోమయం కన్న హీనమైనది. అది దుర్వాసన కలిగి పురుగులతో కులకులాడుతూ ఉంటుంది. అటువంటి గోమయాన్ని ముఖానికి వ్రాసుకుని ఆఫీసుకు గాని, కాలేజీకిగాని వెళ్ళగలుగుతారా మీరు? మరి శుద్ధ మనస్సు నుండి ఉత్పన్నమైన భావాలు ఎలా ఉంటాయి? సత్య వస్తువుని అన్వేషిస్తాడు. మానవ జన్మ సార్థకత ఏమిటి? అని ఆలోచిస్తాడు. అలా ఆలోచన చేయనంత వరకూ మనస్సుకి పట్టిన మాలిన్యం వదిలినట్లు భావించరాదు.

బిందె నిండిన తరువాత నీరు నిలుస్తుందా? మలిన మనస్సు ఎలా ఆలోచిస్తుంది? ధనముంటేనే జగత్తులో మర్యాద అంటుంది. అప్పుడు నీవు సత్యమేనా అను ప్రశ్నించావనుకో అప్పుడు మనస్సు ద్వారా వచ్చే సమాధానం ఎలా ఉంటుందో తెలుసా? ఈ ధనాన్ని సంపాదించేది నేనే కదా! నేను లేకపోవటమేమిటి? అని తర్కం బయలుదేరుతుంది. అంత తర్కములోనూ బుద్ధి ప్రబోధన చేస్తుంది. నువ్వు సత్యమేకాని 25 సంవత్సరాల వయస్సులో మంచి యవ్వనంలో మంచి దుస్తులతో నల్లని వెంట్రుకలతో ఎగిరావు, ఆడావు. మరి ఇప్పుడు 55 సంవత్సరాల వయస్సులో అలా ఎగరగలవా? ఆడగలవా? ఇప్పుడు అలా ఆడలేవుగాని అందరి వ్యవహారాలలోనూ మనస్సు పెట్టి ఆడుకోగలుగుతావు.

మనస్సు జయించిన వాడే పురుషుడు. మనస్సుకి దాసుడైనవాడు ఎవడైనా సరే, ఎంత మీసాలు ఉన్నా స్త్రీ క్రిందే పరిగణింప బడతాడు. మలిన మనస్సు దేహసుఖాన్నే కోరుతుంది. కుక్క కండరం లేని ఎముకను కొరికి

దాని ద్వారా నోటిలో కలిగిన గాయం నుండి వచ్చిన రక్తమును స్వీకరించి అది ఎముక నుండి వస్తోందనిని భ్రమిస్తుంది. ఆ సమయంలో ఏదైనా ఇంకో కుక్క వచ్చిందంటే భౌ్! మని మొరుగుతుంది. కుక్క పొందే సుఖమే శాశ్వతమనుకొనే మనస్సు గల మానవుడు తన జన్మ సార్థకత గురించి తెలుసుకొనేదెప్పుడు? అటువంటి మలిన మనస్సును మార్చగలిగేది ఏది? అని ప్రశ్నించారు.

ఇంకా మాట్లాడుతూ మానవ జన్మ ఎందుకు సార్థకం చేసుకోవాలి? మళ్ళీ మానవ జన్మ వస్తుందని గ్యారంటీ లేదు. కాబట్టి సత్యగురుదేవుని ఆశ్రయించండి. కపట గురువులు ఉంటారు. వాళ్ళు పూటకూళ్ళమ్మ లాంటివారు. వారు తమ పాదములను తాకనివ్వరు. అలా తాకితే వారి కర్మ తమకి సంక్రమిస్తుందేమో అని భయం. కొంతమందికి ఇంట్లో బిందె ముట్టుకుంటే అంటు. అలా అనేవారే గంగానదిలో స్నానం చేయటానికి సంకోచించరు. మరి అక్కడ వీరు మాట్లాడే వర్ణాశ్రమ ధర్మాలు ఏమవుతాయి? గంగానది తన పవిత్రతను కోల్పోతుందా? ఇటువంటి మలిన భావాల నుంచి రక్షించేవాడే సత్యగురువు. ఆయన బోధా శ్రవణం ధ్యానము కన్న గొప్పది. జన్మజన్మల నుంచి ఆర్జించిన కర్మ రహితం అవుతుంది. సత్య గురువు సంకీర్తన కూడా ధ్యానమే. అది ఇంద్రియ దాహాన్ని తీరుస్తుంది. రామానుజాచార్యులవారు అష్టాక్షరీ మంత్రాన్ని అన్ని వర్గాలవారికీ అందించారు. మనస్సు జయించిన వారికి ఎత్తు పల్లాలు ఉండవు. విమానంలో ప్రయాణం చేసేవారికి అంతా సమానమే. క్రిందనున్న వారికే ఎత్తుపల్లాలు. జ్ఞానాన్ని అమ్ముకునేవారు, పాదములని అమ్ముకునేవారు, భోజనాన్ని అమ్ముకునేవారు ఈ ప్రపంచాన్ని వదలరు. వారికి పునర్జన్మ తప్పదు.

వైకుంఠంలో సత్యపాలనే. భూలోకంలోలాగ లంచగొండి ప్రభుత్వం ఉండదు. నువ్వు చేసే పాపకర్మలకు భగవంతుని కళ్ళు కప్పలేవు. నీ మనస్సుకి దాయలేవు. పంచభూతములకు తెలియకుండా చేయలేవు. అందువలననే ఈ కలియుగంలో నిన్ను తరింపజేసేది షోడసాక్షరీ మంత్రము. దీనిని ఎవరు ధ్యానిస్తారో అవస్థాత్రయం నుండి ఈషణ త్రయం నుండి విముక్తులవుతారు. కాబట్టి మీ హృదయబాబు మిమ్మల్ని హెచ్చరిస్తున్నాడు. మీరు చిలకలపూడి బంగారంలా కాకుండా మేలిమి బంగారంలా ప్రకాశించండి అన్నారు.

-సశేషం

# శ్రీకాళీగార్డెన్స్‌లో విశేషపూజా కార్యక్రమములు

సెప్టెంబరు 2011

1 గురు శ్రీవినాయక చవితి, ఉదయం 5గం.30నిలకు శ్రీ సద్గురు పాదపూజ. ఉదయం 11 గం.లకుశ్రీవిఘ్నేశ్వరస్వామి సామూహిక పూజలు. భక్త సమారాధన.

5 సోమ టీచర్స్ డే, ఆచార్య దినోత్సవము, ఉదయం 10 గం. శ్రీ సద్గురు పాదపూజ

10 శని శనిత్రయోదశి.

12 సోమ పూర్ణిమ, శ్రీ సద్గురు పాదపూజ.

22 గురు శ్రీగురుదశమి, సత్సంగసమావేశము, శ్రీసద్గురుపాదపూజ..

26 సోమ మాసశివరాత్రి.

28 బుధవారము నుండి, అక్టోబర్ 8 శనివారం వరకు శ్రీదేవీనవరాత్రి మహోత్సవములు.

28 బుధ ఉదయం శ్రీమాతాజీవారి శ్రీదేవీ శరన్నవరాత్రి పూజా దీక్షా స్వీకారము ప్రతిరోజు ఉదయం 8 గం.లకు శ్రీ రామతారక పరబ్రహ్మ ప్రసాద్, మరియు శ్రీవెంకటరమణ ప్రసాద్ గార్లచే శ్రీదేవీ భాగవత ప్రవచనము. మధ్యాహ్నము జగన్మాత కుంకుమార్చనలు, హారతి, మంత్రపుష్పము, దర్బారు, భక్త సమారాధన.

29 గురువారమునుండి 6గురువారము వరకు వరకు ఆధ్యాత్మిక ప్రవచనములు, శ్రీమాతాజీవారి అనుగ్రహభాషణము, మరియు ఆశ్రమ భక్తుల ఆధ్యాత్మిక ప్రసంగములు,శ్రీ గురుదేవుల దివ్యదర్శనము, బోధ (వీడియో), శ్రీ బాబూజీ మహరాజ్ వాడిన వస్తువులమ్యూజియమ్ ప్రదర్శన

**అక్టోబర్ 2011**

3 సోమవారం శ్రీ సరస్వతీపూజ, మూలా నక్షత్రం,

4 మంగళవారం దుర్గాష్టమి. ఉదయం శ్రీ జగన్మాత సామూహికపూజలు,

5 బుధ మహర్నవమి.

6 గురు విజయదశమి, ఉదయం శ్రీ జగన్మాత సామూహికపూజలు, నామకరణములు, అన్నప్రాశనలు, అక్షరాభ్యాసములు రామాలయంలో జరుగుతాయి.

7 శుక్రవారం ఏకాదశి, ఏకాహం.

8 శనివారం దీక్షావిరమణ, మంత్రపూతమైన పూజాక్షతలతో శ్రీమాతాజీ భక్తులను ఆశీర్వదిస్తారు. రాత్రి 7 గం.లకు జగన్మాత నగర దర్శనోత్సవము. రాత్రి 8 గం.లకు శ్రీ సద్గురు పాదపూజ.

11 మంగళవారం పూర్ణిమ, శ్రీమాతాజీవారి 57వ జన్మదినోత్సవము, శ్రీ సద్గురు పాదపూజ,సత్సంగం, భక్త సమారాధన.

22 శనివారం శ్రీ గురుదశమి, సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ.

25 మంగళ మాస శివరాత్రి, నరక చతుర్దశి, ఉదయం సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ.

26 బుధవారం దీపావళి, ఉదయం సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ. భక్త సమారాధన, రాత్రి 8 గంటలకు టపాసులు కాల్చుట.

29 శనివారం నుండి నవంబర్ 6 ఆదివారం వరకు ప్రతి రోజు ఉదయం శ్రీ రామలింగేశ్వర స్వామి వారికి పంచామృతాలతో, నవ రసాలతో అభిషేకాలు, లక్షబిల్వార్చన

30 ఆదివారం శ్రీనాగుల చవితి.

ఒక షావుకారు చాలా డబ్బు ఖర్చు చేసి ఒక కోనేరు తవ్వించాడు. మంచి పేరు సంపాదించి సంతోషించాడు. మనుష్యులకే కాక పశుపక్ష్యాదులకు కూడ ఆ కోనేరు ఎంతగానో సదుపాయంగా ఉంది. 'పుణ్యాత్ముడు' అని ఆ షావుకారును అందరూ మెచ్చుకున్నారు.

ఇంతలో ఒక రోజున ఒక ముదుసలి సాధువు నీళ్ళకోసం ఆ కోనేరులో దిగుతూ కాలు జారిపడి మరణించాడు. తరువాత కొద్ది కాలానికి షావుకారు కూడా మరణించాడు.

"పద, పద" అన్నారు యమభటులు.

"నేను పుణ్యాత్ముణ్ణి" అన్నాడు షావుకారు.

చిత్రగుప్తుని వివరణ విని, యమధర్మరాజు "ఏమయ్యా! కోనేరు తవ్వించిన పుణ్యం నీకు వస్తే, ఆ కోనేరులో చనిపోయిన సన్యాసి చావుకు పాపం నీకు రాదా?"

షావుకారు నిరుత్తరుడైనాడు.

సకామకర్మ దుష్ఫలితాలు ఇలా ఉంటాయి.

# శ్రీగురు దక్షిణ

(గతసంచిక తరువాయి)

- సుశీలా ప్రసాద

శివుడు నిశ్శబ్దంగా వింటున్నాడు. వాడి మనస్సు కదలి, ఆయన మాటలకి లొంగిపోతుంది. ఏమవుతోంది తనకి! తన కథంతా ఆయనకు చెప్పాలనిపించింది. నోరు తెరిచాడు. మాటలు సెలయేరులా ప్రవహించాయి. "నన్ను తిట్టి, కొట్టి, లోకం బాగా హింసించింది. అందుచేత నాలో పెరిగిన కసి, క్రోధం నన్ను దుర్మార్గుణ్ణి చేశాయి. మరి నేనెలాగ బాగుపడగలను చెప్పండి?''

శివుడి మాటలు విని, రామశర్మ సానుభూతిగా వాడి వెన్ను నిమురుతూ "లోకంలో ప్రేమ, అభిమానం, దయా, దాక్షిణ్యం అనేవి కూడా ఉన్నాయని మర్చిపోకు. నాణేనికి రెండువైపులా ఉన్నట్టు, నువ్వు ఒక వైపే చూశావు. ఇప్పుడిక రెండోవైపు చూసే అవకాశం వచ్చింది. ఆ అవకాశాన్ని నువ్వు చక్కగా ఉపయోగించుకుని బాగుపడాలి సుమా!'' అన్నాడు.

"ఎలాగ? నన్నెవరు ఆదరిస్తారు? నన్ను బాగుచేసేవాళ్ళెవరు?'' అంటున్న శివుడి గొంతు రుద్ధమైంది. "అదిగో! ఎదుట ఉన్నవాడు! ఏదో రూపంలో నీకు దారి చూపిస్తాడు. నీ బ్రతుకు బంగారం చేస్తాడు. ఉత్త రాతిబొమ్మ అనుకోకు. అందులో వెన్నలాగ కరిగిపోయే మనస్సుంది. అది కరిగించడానికి నీ మనస్సులో ఆవేదన అనే వేడి పుట్టాలి. నమ్మకం అనే నిప్పు రగిలించాలి. తెలిసిందా!''.

శివుడు రామశర్మ వంక చూశాడు. ఆయన కళ్ళల్లో ప్రేమ, జాలి, దృఢ విశ్వాసం తప్పకుండా తాను బాగుపడతాననే ధైర్యం చెప్తూ, కాంతిరేఖలు మెరుస్తున్నాయి శివుడి రాతిగుండె, రామశర్మ మాటలకి మెత్తబడుతోంది.

మళ్ళీ ఆయనే అడిగాడు శివుడిని "అయితే నువ్విప్పుడేం చెయ్యాలని వచ్చావు?'' అని, "కాస్తంత అలసట తీర్చుకోవటానికి, ఈ గుళ్ళోకి వచ్చాను. నడుం వాలుద్దామని తీరా యిదిగో యీ వెండి దీపాలు చూడగానే వెనుకటి దుర్బుద్ధి తలెత్తింది. వీటిని తీసుకుపోయి, పట్నంలో అమ్మేసి, పొట్ట నింపుకుని, నిశ్చింతగా నాలుగురోజులు గడపాలనుకున్నాను'' అన్నాడు మనస్సు దాచకుండా శివుడు.

"అది క్షణికమైన సుఖమేగా? ఆ నాలుగురోజులూ గడిచికా మళ్ళీ మునుపటి బ్రతుకేగా? ఈ చింకిపాతలు వేసుకుని, బూచాడిలా ముఖం పెట్టుకుని యీ వెండివి అమ్మడానికి వెడితే, నువ్వు దొంగవని నిన్ను పట్టుకుంటారు. మళ్ళీ చెరసాల పాలవుతావు" అన్నాడు రామశర్మ.

"మరి నాకెవ్వరూ పని యివ్వరు, అన్నం పెట్టరు, నన్ను దొంగగానే చూస్తారు. అయ్యో! నేనేం చెయ్యాలి?" అంటూ దోసిట్లో ముఖం దాచుకున్నాడు శివుడు.

"ఇదిగో యిలారా! నీకు కాస్త మంచి బట్టలిస్తాను, తిండి పెడతాను. ఈ వెండి దీపాలు యిస్తాను. నువ్వు కోరినట్లే ఇవి తీసుకెళ్ళు. ఇక నిన్నెలాగ పైకి తీసుకురావాలో అడిగో! అంతా ఆ వేణుగోపాలుడే చూసుకుంటాడు. వాడిపైన భారం పెట్టి, తప్పకుండా వాడే దిక్కని మాత్రం విశ్వాసం ఉంచుకో. ఏం జరుగుతుందో చూద్దాం!" అన్నాడు రామశర్మ. శివుడు చప్పున వంగి ఆయన కాళ్ళు పట్టుకున్నాడు.

పండుగ వచ్చింది. వేణుగోపాలుణ్ణి రోజూకన్నా ఇంకా బాగా అలంకరించాలనే తొందరో ఉన్నాడు రామశర్మ. వాడిని చూడాలని వచ్చే జనాలకి నచ్చేలా, మెచ్చేలా ఉండాలి తనబిడ్డ! చిన్నగా నవ్వుకున్నాడు తన పిచ్చి ప్రేమకి తనే. 'అయ్యా!' అనే పిలుపు వినబడింది. ఆ గొంతు శివుడిది. రామశర్మ తిరిగి చూశాడు. చేతిలో పూలు, పళ్ళు, కొబ్బరికాయలు. మొహం ప్రశాంతంగా ఉంది. వికార రూపం అంతా పోయింది.

"ఇవన్నీ ఏమిటిరా?" అన్నాడు రామశర్మ. "ముందుగా యివి దేవుడి ముందు పెట్టి, ఒకసారి బైటకి రండి" అన్నాడు శివుడు. వాడి వెనుక నడిచాడు రామశర్మ.

వాకిలి ప్రక్కన, ఒక గోనె సంచి పరచి దానిమీద, పూలు పళ్ళు. వేదరుబుట్టలో పెట్టి ఉన్నాయి. వాటి ముందు కొబ్బరికాయలు. "ఇప్పుడు వీటితో నా బ్రతుకు మొదలవుతున్నది" అన్నాడు శివుడు సంతోషంగా. వాడి ఆలోచనకి ఆశ్చర్యపోతూ నిలిచాడు రామశర్మ.

-సశేషం

# గురు కృపాహి కేవలమ్

-రమణ ప్రసాద్

పరశురామయ్యగారు శ్రీబాబుతో ఆధ్యాత్మిక చర్యలు చేస్తూ ఉండేవారు. విస్తట్లో అన్నం కలుపుకుంటూ ఆధ్యాత్మిక చర్చలలో మునిగిపోయేవారు. ఒకొక్కసారి వారి చర్చలు అర్ధరాత్రి దాటేవి. శ్రీబాబు కాళీమాతతో తన చర్చల సారాంశం గురించి విన్నవించి, అది 'అక్షరాల సత్యం' అని అమ్మ అన్న తరువాతనే సంతృప్తి చెందేవారు.

నవరాత్రి ఉత్సవాల సందర్భంగా శ్రీబాబు అనుగ్రహ భాషణ చేస్తూ, మధ్యలో నన్ను చూపిస్తూ (రమణబాబు) 'వీడూ, నేనూ క్లాస్‌మేట్స్. మా ఇద్దరికీ మా నాన్నగారు (పరశురామయ్యగారు) ఒకేసారి అక్షరాభ్యాసం చేశారు"అనేవారు.

శ్రీబాబు చిన్నవయస్సులోనే అనుభవ జ్ఞానం సంపాదించారు కనుక వారు ప్రపంచం అంతా పర్యటించి స్వామివివేకానందవలె ఆధ్యాత్మిక విద్యను అందించాలి అని పరశురామయ్యగారి అభిలాష. అందువల్లనేనేమో శ్రీబాబుని ఇంగ్లీషు నేర్చుకోమనేవారు. నేను **A, B, C, D** లు దిద్దుతుంటే, శ్రీబాబు కలం మొదటి అక్షరంమీదనే ఆగిపోయేది. ఆ అక్షరాలలో అమ్మ కనిపించేది. కలం ఎక్కడ అమ్మ కళ్ళల్లో గుచ్చుకుంటుందో అని కన్నీరు కారుస్తూ అలాగే ఉండిపోయేవారు. అయినాసరే నాన్నగారి చిరకాలవాంఛను పూర్తిచేశారు శ్రీబాబు. అనేక దేశాలు పర్యటించారు. అక్కడ వారినవి తమ భక్తులుగా చేసుకున్నారు.

శ్రీబాబు మాట్లాడుతూ "వీడేమో చదువుకుని ఆఫీసరు అయ్యాడు. నేనేమో అమ్మ అనుగ్రహంతో మీ ముందు ఇలా ఉన్నాను. ఏరా! నీ డిజిగ్నేషన్ ఏమిటి? నీ జీతం ఎంత?" అని సభలో అడిగేవారు. నేను నీళ్ళు నములుతుంటే "చెప్పరా, వీళ్ళంతా వింటారు" అనేవారు. నేను "ఛీఫ్ ఫైనాన్స్ మేనేజర్, ఆరువేలు జీతం" అని చెబితే, చూశారా వీడేమో ఇంత సంపాదిస్తూ భార్యా బిడ్డలని పోషించుకుంటున్నాడు. నేనేమో...." అంటూ అగిపోయేవారు.

నా యీ చదువు, ఉద్యోగం అంతా బాబు కృపయే. వారి కృపా కటాక్షం ఎలా భక్తులపై నిరంతరం వర్షిస్తాయో తెలుసుకోవటానికి మా పెద్దబ్బాయిని మృత్యుముఖం నుండి రక్షించిన విషయాన్ని శ్రీబాబుకు కృతజ్ఞతలు తెలుపుకుంటూ వివరిస్తాను....

మా అబ్బాయికి 4, 5 సంవత్సరాల వయస్సులో ఉండగా శ్రీబాబు విజ్ఞానమందిర్ రెండో అంతస్తులో ఆడుకోవటానికి వెళ్ళేవాడు. అక్కడ చిన్న పోర్టికో ఉండేది. దానికి ఒక రంధ్రం ఉండేది. అక్కడి నుంచి చూస్తే అమ్మగదికి వెళ్ళే మెట్లు కనిపిస్తాయి. ఒకరోజు ఉదయం మా పిల్లవాడు అక్కడ ఆడుకోవటానికి వెళ్ళాడు. అప్పుడు ఆ రంధ్రం మీద చాపవేసి ఉన్నది. పరుగెత్తుతూ ఆ చాపమీద కాలు వేయగానే, క్రింద నున్న మెట్లమీద పడి స్పృహ కోల్పోయాడు. సరిగ్గా నుదురు కణతకు మెట్ల అంచు తగిలింది. డాక్టరుగారు 24గంటలు అబ్జర్వేషన్ చేయాలి అన్నారు. ఆ తరువాత కూడా దాని ప్రభావం ముందుముందు ఎలా ఉంటుందో చూడాలి అని అన్నారు.

అన్నిటికీ బాబే ఉన్నారని బాబుని చూడాలని కూర్చుంటే శ్రీబాబు ఆ మరునాడు దర్శనం ఇచ్చారు. "పిల్లవాడికి ఎక్స్‌రే తీయించి, డాక్టర్ల అభిప్రాయం తెలుసుకోండి" అన్నారు శ్రీబాబు. "బాబూ! మీ దయ వల్ల రక్షణ జరిగింది. ఇంకా ఎక్స్‌రే కోసం బయటకి తీసుకువెళ్ళటం ఎందుకు? అన్నాము. "చెప్పింది చేయండి" అన్నారు బాబు. ఎక్స్‌రేలో కణత వద్ద 'స్లిట్' ఉన్నదని, అది కూడా కలుసుకుపోతుందని అన్నారు డాక్టర్లు. మా అబ్బాయికి శ్రీబాబు దయవలన పూర్తిగా స్వస్థత చేకూరింది.

శ్రీబాబు ఈ విషయాన్ని గురించి నవరాత్రుల శ్రోతలకు అనుగ్రహ భాషణ చేస్తూ, మా అబ్బాయిని లేపి, నాతో "ఒరేయ్! వీడికేనా తలకి దెబ్బ తగిలింది" అని అడిగారు. నేను "బాబూ! మీరే రక్షణ చేసి ప్రాణ భిక్ష పెట్టారు" అన్నాను."ఆ నమ్మకం ఉంచుకో చాలు" అన్నారు.

ఇలా నా జీవితంలో ఎన్నో సంఘటనలు జరిగాయి. ఉచ్ఛ్వాస నిశ్వాసలను కూడ గమనించగలమేమో కాని రాబోయే విపత్తులను తెలుసుకో లేము. గురుదేవుల స్మరణ అప్పుడు ఉంటుందో లేదో చెప్పలేము. కాని అనుక్షణం వారి అభయహస్తం మనల్ని కాపాడుతూనే ఉంటుంది.

ఉద్యోగకాలంలో హైదరాబాదులో మా ఇంట్లో నేనూ, మా ఆవిడ ఉన్నప్పుడు స్క్రూడ్రైవర్‌తో ఏదో రిపేర్ చేస్తుంటే, షార్ట్ సర్క్యూట్ అయి నా చెయ్యి స్క్రూడ్రైవర్‌కి సర్క్యూట్ అంటుకుపోయింది. నేను అరిచేసరికి మా ఆవిడ బాబూ!బాబూ! అంటూ స్విచ్ ఆఫ్ చేయటం వలన రక్షణ జరిగింది.

రామగుండంలో ఉన్నప్పుడు లాక్‌చేసిన స్కూటర్‌ని డ్రైవ్ చేసుకుంటూ వెళ్ళాను. అక్కడా రక్షణ జరిగింది. ఆ స్పీడ్‌లో హ్యాండిల్ పక్కకు తిప్పితే

లాక్ పడి యాక్సిడెంట్ అవటం ఖాయం. ఇలా శ్రీగురుదేవుల కృపచేత పరిపరి విధాల రక్షణ జరిగింది

గురుకృప సదా వర్షిస్తూనే ఉంటుంది అన్నదానికి తార్కాణం ఈ మధ్యనే జరిగిన సంఘటన......

ఒకరోజు నాకు కుడివైపు కాలు, చేయి లాగుతుంటే డా॥అశోక్ చూసి వెళ్ళి, ఆ తరువాత శ్రీమాతాజీ అమెరికా నుండి ఫోన్ చేసి, "పోనీ ఒకసారి స్పెషలిస్ట్ డాక్టరుకు చూపించుకుంటే బాగుంటుంది కదా'' అన్నారు. అంతవరకూ నాకేమి జరుగుతున్నదో తెలియని స్థితిలో వారే ఫోన్ చేసి అడిగారు. అప్పటికి నా మాట ముద్దగా వస్తోంది. కుడి భాగం మెదడు ఎటాక్ అయిందని తరువాత తెలిసింది.

"ఇంకా కొన్ని గంటలు ఆలస్యం చేస్తే పరిస్థితి విషమించేది'' అని నన్ను చూసిన న్యూరాలజిస్ట్ డాక్టరుగారు చెప్పారు. అన్ని టెస్టులూ చేసి మందులిచ్చారు. నాకు నయమై ఇంటికి వచ్చాను.

సంతతధారగా అనుగ్రహవర్షం కురిపించే గురుదేవుల ఋణం ఏనాటికైనా తీర్చుకోగలమా? వారికి శ్రద్ధా పూర్వక కృతాంజలులు అర్పించుకోవటం తప్ప. వారిని మరవకుండా వారి ఛత్రఛాయలో ఉంటూ ఈ జన్మను సార్ధకంచేసుకోవాలనీ, శ్రీగురుదేవులు అట్టి వరాన్ని నాకు ప్రసాదించాలని మనసారా కోరుకుంటున్నాను.

■

## శ్రద్ధాంజలి

పాందువ గ్రామ నివాసులైన శ్రీసద్గురుదేవుల పరమభక్తులు, శ్రీమతి కునాధరాజు అప్పలనరసమ్మగారు (కీ॥శే॥ ధర్మరాజుగారి ధర్మపత్ని) 7-8-2011 వ, తేదీన శ్రీసద్గురుసాయుజ్యం పొందారు, వీరి వయస్సు 89సంవత్సరములు. భగవానుడు వీరి కుటుంబ సభ్యులకు, బంధు మిత్రులకు ఆత్మశాంతిని ప్రసాదించు గాక!

# శ్రీకృష్ణ కర్ణామృతం

(గతసంచిక తరువాయి)

-సుశీలా ప్రసాద

**తరుణారుణ కరుణామయ విపులాయత నయనం**
**కమలా కుచ కలశీభర విపులీకృత పులకమ్,**
**మురళీరవ తరలీకృత ముని మానస నలినం**
**మమ ఖేలతి మమ చేతసి మధురాధర మమృతమ్ ॥**

"తాతా! నీకిక్కడ చాలా సుఖంగా ఉంటుంది. చల్లనిగాలి, చలేస్తే వెచ్చగా ఎండ తగులుతుంటాయి. కాళ్ళు జాపుకుని పడుకోవటానికి కావలసినంత చోటుంది." మనవుడు చెప్తుంటే వింటూ "అలాగా నాయనా! ఇదంతా నా కోసమేనా?" అన్నాడు తాత దూరం వడిచి వచ్చిన అలసట, ఆయాసంతో భారంగా.

"ఔను తాతా! అక్కడ యింట్లో అందరిలో ఉండటానికి నీకు ఇరుకుగా ఉందిగదా1 మా మధ్యలో ఉండేందుకు నువ్వు ఇబ్బందిగా ఉండి బాధ పడుతున్నావు పాపం! అందుకే అమ్మవాళ్ళు నిన్నిక్కడ ఉంచుదామని అనుకున్నారు. రోజూ నేను వేళకి నీకు అన్నం తెచ్చి పెడతాను. ఎదురుగా ఉన్న నదిలో నీళ్ళు తెచ్చి నీకు స్నానం చేయిస్తుంటాను. నీకు లోటు లేకుండా చూసుకోవాలని అందరూ అనుకున్నాం" అని ప్రేమ ఒలకబోస్తూ చెప్పి "అన్నట్టు నీకు దాహం వస్తే చేతికందేంత దగ్గర్లోనే మంచినీళ్ళకుండ, ముంత ఉన్నాయి. ఈతాకుల చాప మీద బొంత దిండు పెట్టాను. మరి నేను వెళ్ళొస్తాను" అంటూ వెళ్ళిపోతున్న వాడి అడుగుల చప్పుడు వింటూ స్తబ్ధుగా అలాగే ఉండిపోయాడు తాత.

అతడికి చెవులు పనిచేస్తాయిగాని, కళ్ళు పనిచేయవు. రెండు చేతులున్నాయి గాని ఒక కాలు లేదు. పుడుతూనే చూపుకి నోచుకోని అభాగ్యుడు గౌరన్న. ప్రమాదంలో ఒక కాలు పోగొట్టుకున్నాడు. ఇంతవరకు తానున్న చోట యింట్లోవాళ్ళ యీసడింపులు, పిల్లల అరుపులు, ఇరుగు పొరుగుల వెటకారాలు వీటితో కాలం గడుస్తోంది. ఇప్పుడిక్కడ ఏ శబ్దమూ లేదు, చూడటానికి పగలూలేదు రాత్రీలేదు. అన్నమాట ప్రకారం మనవడు వచ్చి వాడి పనేదో వాడు చేసివెడుతున్నాడు గానీ క్లుప్తంగా తప్ప తాతతో ఎక్కువగా మాట్లాడటం లేదు.

కొద్దిరోజులు గడిచాక, పరిసరాలకు అలవాటు పడ్డాక గౌరన్న చెవులకి

యిప్పుడు ఆవుల అంబారవాలు, పిల్లల కేరింతలు, ఎకసెక్కాలు దగ్గిరే ఉందన్న నదిలో కెరటాల చప్పుళ్ళు మెల్లగా వినరాసాగాయి. రోజూ వచ్చే మనవుడు రాకపోకలు తగ్గించి ఆపైన అసలు రావటం మానేసరికి గౌరన్నకి అర్థమైంది. అందరూ తనని ఒంటరిగా వదిలేశారన్న సంగతి. తన బ్రతుకులో తనకిక తోడెవరూ లేరన్న బాధతో కుమిలిపోతూ బావురుమంటున్న వేళ....

"గౌరీ!" అనే ప్రేమపూరితమైన స్వరం వినవచ్చింది. గౌరన్నకి ఒళ్ళు జల్లుమంది. ఎవరలాగ తనని పిలిచింది! తన చిన్నతనంలో తన తల్లి తనను 'గౌరీ!' అని ప్రేమగా పిలిచేది. అదే పిలుపు, అదే ఆప్యాయత నిండిన ఆ గొంతు ఎవరిది? అడుగుల చప్పుడు మెల్లగా వినవస్తోంది. భుజం మీద మెత్తగా చెయ్యిపడిన స్పర్శ! వచ్చినదెవరో తను చూడలేడు. గుండెలు గుబగుబ లాడుతుంటే "ఎవరు?" అన్నాడు. "నేను కన్నయ్యను. నువ్వు నన్నెరగవుగాని, నువ్వు నాకు బాగా తెలుసు. కుంటి గ్రుడ్డి అయిన నిర్భాగ్యుడివి. నువ్వు నీ తల్లిదండ్రులున్నంతకాలం నీకు బాగానే గడిచింది. వాళ్ళుపోతూ "నాయనా! నీకు ఇక ఆ దేవుడే దిక్కురా" అన్నారు. నువ్వు అమాయకుడివి కనుక "నాకేం లోటు! అన్నలు వదినలు వాళ్ళ పిల్లలు అందరూ నన్ను ప్రేమగానే చూస్తారులే" అనుకున్నావు. ఎవరు ఎల్లకాలం నిన్ను చూస్తారని అనుకున్నావో, ఆశపడ్డావో వాళ్ళు నీకున్న కొద్దో గొప్పో ఆస్తంతా కాజేసి నిన్నిప్పుడే ఊరిబైట పాకలో పడేశారు.ఏనాడో నీ మనస్సు తెరుచుకుని ఉండాల్సిందిగానీ గడ్డిపోచలాంటి ఆశను పట్టుకుని వేళ్ళాడావు. అది కాస్తా పుటుక్కున తెగి, నీకు లోకంతో సంబంధం వదిలిపోయిన యీ సమయంలో పూర్తిగా అర్థమైందనుకుంటాను 'నీకు దేవుడే దిక్కురా' అని మీ అమ్మ అన్నమాట' ఏమంటావు?"

ఉడికిపోతున్న మనస్సుకి మంచుతాకినంత చల్లగా ఉన్న ఆ పలుకులు వింటూ గౌరన్న తన సరసనే ఉన్న ఆ మూర్తి చేతుల్ని తడిమి పట్టుకుని "నన్నూ, నా బ్రతుకునీ ఇంత తెలిసినవాడివి, నాకు దిక్కయ్యేందుకు వచ్చిన దేవుడివే కదూ!" అంటూ "నన్నిక వదలకు" అంటూ కన్నీళ్ళతో వేడుకొన్నాడు. "ఔను! ఇక నిన్ను వదలను. నువ్వెప్పుడూ నన్ను మర్చిపోవద్దు!" అన్నాడు కన్నయ్య. "నిన్నేమని పిలవను?" అని అడిగే గౌరన్నతో "కన్నా! అను చాలు. మళ్ళీవస్తా"నంటూ ముందుకు వెళ్ళిపోతున్న వాని కాలి అందెల చప్పుడు తాత మనస్సులో మారుమ్రోగుతూ ఉండిపోయింది.

-సశేషం

# పరిప్రశ్నేన సేవయా

-పరాశర ప్రసాద్

"ధ్యానంలో వెధవ మనస్సు నిలవటం లేదు. ఎంత ప్రయత్నించినా మనస్సులోకి ఇతర ఆలోచనలు రావటం ఆగటం లేదు" అని లేవనెత్తిన సందేహానికి సమాధానంగా సద్గురుదేవులు సమాధానం చెబుతూ "మనస్సు ఎన్నడూ వెధవది కాదు. మనస్సు మంచిదే. మనస్సుకి మకిలి పట్టించుకున్నావు. దానిని వదిలించుకోవాలి.

లాంతరు వెలుగులో దోషం లేదు. పోనీ దాని గాజు చిమ్నీ దోషము ఉందా! అదీ లేదు. గాజు చిమ్నీ లోపల మకిలి ఉంది. అందువలన కాంతి హీనంగా ఉంది. దోషము లాంతరుది అని భావిస్తే ఏం లాభం?

ధ్యానానికి ఎంతసేపు కూర్చుంటావు? కొంతటైము పెట్టుకుంటావు కదా! ఒక గంట కూర్చుంటావు. మరి ఆరోజు మిగిలిన 23గంటల కాలాన్ని ఎలా వినియోగిస్తావు? ఇంటి వ్యవహారాలు, ఆఫీసు వ్యవహారాలు, స్నేహితులతో సంభాషణ, న్యూస్‌పేపరు, టి.వి. ఇంకా ఏవో అనుకోని విధంగా ఇతర సంఘటనలు.

నువ్వు ధ్యానానికి కూర్చోగానే రోజు మొత్తం మీద మిగిలిన 23గంటల కాలాన్ని ఎలా వినియోగిఏంచావో ఆ వ్యవహారాలే నీ మనస్సులో నీకు ఎదురుగా నిలబడతాయి. ధ్యానంలో మనస్సు నిలబడాలంటే నీ దినచర్యలో మార్పురావాలి. అలాగని నీ భార్యా పిల్లల్ని సంసారాన్ని త్యజించమని చెప్పను. కర్మ చేయవలసిందే. విధి నిర్వహణలో లోపం ఉండకూడదు.

అనుక్షణం భగవంతుడు నీ వెంట ఉన్నాడనే విషయాన్ని మరువ కూడదు. సమయం దొరికినప్పుడు సద్గురుమూర్తి బోధ శ్రవణం చేయాలి. అంతేకాదు శ్రవణం చేసిన బోధని మననం చేయాలి. కుటుంబ సభ్యులంతా కూర్చుని తత్త్వ విచారణ చేసుకోవచ్చు.

సత్సాంగత్యము ఎంతో దోహదం చేస్తుంది. మంచినే చేయాలి. మంచినే ఆలోచించాలి. సంసారంలో కష్ట సుఖాలు అనేవి తప్పవు. వాటిని గురించి ఎక్కువగా ఆలోచించి మనస్సుని పాడుచేసుకో కూడదు.

భగవద్గీతలో శ్రీకృష్ణపరమాత్ముడు చెప్పినట్లు ధ్యానం అభ్యాసం చేయగా చేయగా తప్పక నీకు మనస్సు అనుకూలించి స్థిరపడుతుంది.

ధ్యానంలో మనస్సు ఏ ఒక్క క్షణమో నిలిచినంత మాత్రం చేత తరించానని ఎన్నడూ భావించకూడదు. మనస్సు అన్ని వేళలా మన నియంత్రణలో ఉంచుకోవాలి.

ప్రతి కదలికలోనూ మనస్సుని గమనించి దానిని నియంత్రించ గలిగితే ఇంక కావల్సింది ఏముంది? నువ్వు సాధన పట్టుదలతో చేయాలిగాని నువ్వు ఆశ్రయించిన గురుపాదము నిన్ను గమ్య స్థానానికి చేర్చలేదా! ధ్యానంలో మనస్సు నిలబడిందా లేదా అన్నది నీకు అనవసరము. నువ్వు చేయవలసిన సాధన నువ్వు చెయ్యి. అంతవరకే నీ కర్తవ్యం'' అని ముగించారు శ్రీగురుదేవులు. *

ఒక పిసినిగొట్టు తన ధనమంతా బంగారు ముద్దగా చేసి ఇంట్లో ఉంచితే దొంగలెత్తుకుపోతారేమో అనే భయంతో ఊరి బయట చెట్లతోపులో ఒక చోట గొయ్యి తీసి ఎవరికీ తెలియకుండా అందులో దాచి ఉంచాడు. రోజూ తెల్లవారకుండా వెళ్ళి ఆ గోతి నుంచి బంగారు ముద్దను బయటకు తీసి చూసుకుని మురిసిపోయి, మళ్ళీ యధాప్రకారంగా అందులోదాచి వచ్చేస్తుండేవాడు.

ఒకనాడు ఒక దొంగ పిసినిగొట్టు చర్యను కనిపెట్టి, వానికి తెలియకుండా వెళ్ళి ఆ బంగారాన్ని తస్కరించి దాని బదులుగా ఆ గోతిలో ఒక గుండ్రాయిని నెట్టి వచ్చేశాడు. మర్నాడు పిసినిగొట్టు బంగారు ముద్ద బదులుగా రాతిని చూసిగుండెలు బాదుకుని ఏడుస్తుండగా నలుగురూ చేరి వాని ద్వారానే సంగతి గ్రహించి, "ఆ బంగారం వల్ల నీకు ఉపయోగం లేదు. ఎవరికీ పనికిరాదు. ఎవరికీ పెట్టని, నీకూ ఉపయోగించని అది బంగారమైనా, రాయైనా ఒకటే కనుక పోనీలే ఆ రాతినే బంగారు ముద్ద అనుకుని సంతోషిస్తూ ఉండు" అని ఓదార్చి నవ్వుకుంటూ వెళ్ళిపోయారు.

పిసినిగొట్టు ధనం ఎంత ఉన్నా ఎందుకూ కొరగాదు ఎలాగంటే ఎండలో మాడుతుండే బాటసారికి అతని మేని నీడ ఏమి మేలు చేస్తుంది?

# సర్వరోగహరులు

సేకరణ- దాసరి బుల్లి బ్రహ్మయ్య

ఇది నా (దేవళ్ళు) అనుభవ పూర్వకమైన విషయం. ఏమంటే కొన్నేళ్ళ వెనుక...సర్వజ్ఞులు సమర్థులు అయిన శ్రీ సద్గురుమూర్తి తరుచు వారి పరమానుగ్రహంతో మా యింటికి వస్తుండటం తటస్తించేది. వారు ధరించే దుస్తులు మాయింట్లో ప్రత్యేకంగా ఒక బీరువాలో ఉండేవి. మాయింటి చాకలితో శ్రీబాబు దుస్తులు ప్రత్యేకంగా ఎక్కువ ధర యిచ్చి ఉతికించేవాళ్ళం. ఆ చాకలి ఉతుకు, ఇస్త్రీ చేయటంలో వాని నేర్పరితనానికి బాబూజీ ముచ్చట పడుతుండేవారు కూడాను.

ఇలాగ కొన్నాళ్ళు గడిచాక ఆ చాకలివాడు శ్రీబాబు బట్టలకి ఇంకా ఎక్కువ ధర అడగసాగాడు. నేను వానితోటి "బాబు మా యింటికి వచ్చినపుడు భక్తులకి భోజనాలు, వసతులు కల్పించటం వంటి ఖర్చులన్నీ నేను లెక్కపెట్టుకోకుండా సేవాభావంగా చేస్తున్నాను కదా! నువ్వది గ్రహించక డబ్బు ఎక్కువ కావాలంటావేమిటి?" అన్నాను. అందుకు వాడు "మీ గురువుగారంటే మీకు యిష్టం గనుక మీ యిష్టం వచ్చినట్లు ఖర్చుపెట్టుకుంటారు. నాకాయన గురువుగారేమీ కాదు. వారు నాకు లెక్క ఏమిటి?" అని జవాబిచ్చాడు. ఆ మాటకు నేను నొచ్చుకుని వాడిష్టప్రకారమే కానివ్వమని ఊరుకున్నాను.

ఇదిలా ఉండగా ఆ చాకలివాడు ఒకనాడు కొండకు కట్టెపుల్లలకోసం వెళ్ళాడు. ఆ పుల్లలు నరకటంలో ఒక పుల్ల తెగి కంటికి బాగా దెబ్బ తగిలింది. నెత్తురు కారుతోంది. నేను మా యింట్లో మేడమీద గదిలో శ్రీబాబుతో మాట్లాడుతున్న సమయంలో అతడు వచ్చి క్రిందనించి నాకు కబురు పంపించాడు. నేను వచ్చి సంగతేమిటని ప్రశ్నించగా జరిగినదంతా చెప్పి కంటి గాయం గురించి బాబుకి చెప్పి మాన్పే ఏర్పాటు చెయ్యమని ప్రాధేయపడసాగాడు. నేను సరేనని యీ విషయం బాబుతో విన్నవించాను. వెంటనే బాబు "మనం ఏమి చెయ్యగలం? మన దగ్గర కత్తులు, కత్తెరలు ఫోర్సెప్స్ వంటి ఇన్స్ట్రుమెంట్స్ లేవు. లాభంలేదు" అన్నారు. వారన్న మాటలు నేను వెళ్ళి చాకలితో చెప్తే వాడు పట్టుదలతో " మీ బాబుగారే తగ్గించగలరు" అని గట్టి పట్టుపట్టి కదలకుండా కూచున్నాడు. నాకేమీ తోచలేదు. బాబు చెప్పిన

మాటకి తిరుగులేదు. చాకలివాని అమాయకపు పట్టుదలకి విడుపులేదు. ఏం చెయ్యాలి? అజ్ఞాని అయిన వానిలో అంత విశ్వాసాన్ని కలిగించిన సద్గురుమూర్తి లీలనే తల్చుకుంటూ నేను ఆలోచనలో ఉండగా ఒక ఉపాయం స్ఫురింప చేశారు నాకు బాబు.

అప్పుడు ఉదయం సుమారు 10 గం॥లైంది. శ్రీబాబు స్నానం చేసి గదిలోకి వెళ్ళారు. వెంటనే నేను ఆ స్నానం చేసిన నీళ్ళు తీసుకుని వచ్చి చాకలివాని కంటి మీద 'ఓం బాబు' అని జల్లాను. అలాగ వరసగా 2,3 రోజులు చేసిన తరువాత ఆ గాయం నయమైపోయింది. చాకలివానికెంతో సంతోషమైంది.

తరువాత శ్రీబాబుతో "మీరు సాధ్యం కాదన్నారుగాని చాకలివాని గాయం నేను నయం చేశాను" అని బాబు దయ నామీద వర్షించిందనే రవంత గర్వంతో అన్నాను. ఆ గర్వాన్ని హరించటానికి వెంటనే బాబు "నేనలాగ ఎందుకన్నానో తెలుసా? నీ మంచికోసమే సుమా! వాడి గాయం మానిన సంగతి తెలుసుకుని ఆపేటలో వారందరూ వారికి ఏచిన్ని ఆపద వచ్చినా నీగొంతు మీదకి వచ్చి పడతారు. ఆ ఒత్తిడికి నీవు తట్టుకోలేవని అలాగన్నాను" అని చెప్పారు.

అయితే నా విశ్వాసము, చాకలివాని విశ్వాసము ఆ గాయం మానేందుకు మూలం కాగా అసలు కారణం సర్వరోగహరులు సమర్థులు అయిన శ్రీసద్గురుమూర్తి కరుణ, అనుగ్రహమే!

■

అంత్యజులు, అంత్యజులు అని ఘోషిస్తారు. అంత్యజులు యింట్లోకి రాకూడదంటారు అగ్రజులు. కాని అజ్ఞాన దృష్టితో చూస్తున్నారే తప్ప రుద్ర భక్తుల యిళ్ళలో కులహీనులు ఎవరుంటారు? రుద్రులుగాక క్షుద్రులుంటారా? నిజమైన మహేశ్వరుల యిళ్ళలో మహేశ్వరులు గాక మనుష్యులుంటారా?

- పండితారాధ్య చరిత్ర

# బాబూజీ రాజయోగి

(ఆంధ్ర ప్రభ 1988 డిసెంబర్ 12) - రామస్వామి సంపత్

కళ్ళ ఎదుట కనిపించే అద్వైత మూర్తి ఆయన. ఆయనను రాజయోగి అంటారు గాని ఆయన అంతకంటె మించిన యోగి. భక్తుల మన్ననలను అందుకొన్న పరమ గురువు ఆయన. సమర్థ సద్గురు శ్రీ హనుమత్ కాళీవర ప్రసాదబాబు. ఆయన డిసెంబర్ 3, 1988 శనివారం నాడు పాంచభౌతిక దేహాన్ని విడనాడారు. ఆయన పరిపూర్ణ సన్యాసి. బాహ్యవేషధారణలోగాక మానసిక సన్యాసం ఆయనది. సర్వ సంకల్ప సన్యాసం.

మద్రాసు, కలకత్తా జాతీయ రహదారిలో గుంటూరు-విజయవాడ మధ్య నంబూరు రైల్వే స్టేషన్ సమీపంలో 1972లో శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమాన్ని నిర్మించారు. ఆశ్రమంలో బాబూజీ ముముక్షువులందరికీ తమ దర్శన, స్పర్శన, సంభాషణ, వందనాది అభీష్టాలను నెరవేర్చారు. ఆత్మానుభూతిని పొందగోరే జిజ్ఞాసువులను ప్రోత్సహించి, స్ఫూర్తిని, శక్తిని ప్రసాదించిన దేశికోత్తముడు.

శ్రీబాబూజీ పుట్టుపూర్వోత్తరాలు తెలియనప్పటికీ చిన్నతనం నుండీ పరిచితులైన వ్యక్తులు ఆయన బాల్యంలోనే భౌతిక బంధాలను ఛేదించుకుని, ఆత్మసాక్షాత్కారం పొంది, నిరంతరం ఆత్మానందంలో ఓలలాడుతూ ఉండేవారనీ, సర్వసిద్ధులు తమకు తామై ఆయన్ని వరించి ఉండేవనీ అంటారు. అయినా వాటిపట్ల ఉదాసీన భావంతో ఉండేవారని శ్రీబాబూజీని గురించి తన్మయత్వంతో చెబుతారు.

అప్పుడప్పుడు యధాలాపంగా శ్రీబాబూజీ ప్రస్తావనలను బట్టి ఆయన బాల్యం గురించి తెలిసింది. బాబూజీకి బాల్యంలోనే ఇష్టమైన శ్రీరామ సాక్షాత్కారం జరిగిందట! అనంతరం శ్రీరాముని ఆదేశంపై అకుంఠిత దీక్షతో కఠోర సాధన చేసి శ్రీకాళీమాత అనుగ్రహాన్ని పొందిన బాల్యంలోనే ఆ జగజ్జనని అందించిన జ్ఞానక్షీరాలను గ్రోలిన మహనీయుడు బాబూజీ.

బాల్యంలో ఒకసారి గోదావరి వరదలలో చిక్కుకున్న సమయంలో శ్రీబాబుకి హనుమాన్ దర్శనమైంది. అప్పటి నుండి హనుమాన్ తనకు తోడుగా రక్షగా ఉన్నట్లు ఆయన అనుభూతిని పొందుతూ ఉండేవారు. అప్పటి నుంచి హనుమత్ కాళీ వర ప్రసాద బాబుగా ప్రసిద్ధులయ్యారు.

-సశేషం

# భగవత్సాక్షాత్కారము

- రమణ ప్రసాద్

సకల కార్యములలోను ఆత్మసమర్పణ అతి ఆవశ్యకము. ఆత్మసమర్పణభావంతో శాస్త్రాలలో చెప్పిన ఏ మార్గాన్ని అనుసరించినా భగవదనుగ్రహాన్ని పొందుతాము. ఐహిక సుఖాలను విడిస్తే పరమపదము సిద్ధిస్తుంది.

ఏకార్యము చేసినా 'నేను', 'నాది' అనే భావన లేకుండా చేయాలి. భగవంతుని ప్రతిమను నిర్మలభక్తితో గృహంలో అనుదినము పూజిస్తూ, భగవంతుని మహిమలను కీర్తించేవానికి బ్రహ్మానందం లభిస్తుంది.

నిర్జనమైన ఏకాంత ప్రదేశమున కూర్చుని ప్రాపంచిక విషయాలను మరిచే ప్రయత్నం చెయ్యాలి. ఐహికవిషయాలను తాత్కాలికంగా మరువగలిగితే మిగిలేది 'ఆత్మ'. ఆ ఆత్మపై ధ్యానం చెయ్యి. ధ్యానం వలన సమాధిస్థితి కలుగుతుంది. సమాధి వలన జీవన్ముక్తి లభిస్తుంది.

నువ్వు చేసే పనులు నిస్వార్థంగా ఇతరులకు మేలు కలిగేటట్లుగా ఉండాలి. అంతకుమించిన పవిత్రకార్యం ఇంకొకటి లేదు. 'రామచరిత మానస్'లో శ్రీరామచంద్రుడు ఇలా అంటాడు -

**పరహిత్ పరమ ధరమ పహి భాయీ।**
**పరపీడా నమ్ నహిఅధమాయీ॥**

ఇతరులకు మంచి చేయుటంకంటె పవిత్రమైనది ఏదీ లేదు. ఇతరులకుహాని చేయుటంకంటే అధమమైనది ఏదీ లేదు.

ఈ సూత్రం ఒక్కటీ పాటిస్తే చాలు. మానవుడు ప్రాపంచిక వాసనలనుండి ముక్తుడై పరమార్థస్థితిని పొందుతాడు.

ఇంద్రియాలు, మనస్సు స్వాధీనంలో ఉంచుకొని ధ్యానం చేయుటం ఉత్తమం. మనస్సు, ఇంద్రియాలు స్వాధీనానికి రాకపోతే, ఉపవాసము, సదాచారము మొదలైన సాధనలను చేయాలి. లౌకికదృష్టి లేకుండా

ఆత్మోన్నతికొరకు సాధనచేయాలి.ఫలాపేక్ష లేకుండా సాధన చేయాలి. యోగసాధన, మనస్సు, ఇంద్రియాలు నియంత్రణలో ఉన్నప్పుడు చేయాలి. మనస్సు,ఇంద్రియాలు స్వాధీనంలోకి రావలంటే ఉపవాసం, సదాచార నియమాలు ఫలాపేక్ష లేకండా చేయాలి. భగవంతునిపై భక్తిని పెపొందించుకొనే మార్గమే అన్నిటికన్న సులభమైన మార్గం . భగవానుని దివ్య నామం ఎప్పుడూ చేస్తూ ఉంఢాలి. భగవన్నామం ఎప్పుడూ మనస్సునుండి దూరం

కాకూడదు. గోస్వామి తులసీదాసు . రామచరిత మానస్'లో ఇలా అన్నాడు -

**సుమిరి పవనసుత పావన నామూ।**
**అపనే బస్ కరి రాఖే రామూ॥**
**అపతు అజామిళు గజు గణికావూ।**
**భయే ముకుత్ హరి నామ్ ప్రభావూ॥**

పావననామం స్మరించి పవనసుతుడు శ్రీరాముని తనవానినిగా చేసికొన్నాడు. అజామిళుడు, గజేంద్రుడు, గణికుడు హరినామ ప్రభావంచేతనే తరింపబడ్డారు.

ఏ కఠిన సాధన చేయనవసరం లేక నిత్యానంద మొసగే మార్గం ఒకటి ఉన్నది. అది ఎప్పుడూ ఆనందంగా ఉండటానికి ప్రయత్నించే మార్గం. ఆనందం భగవానుని అంశ. ఈ జగమంతా ఆనందమయమై ఉన్నది అని గుర్తించాలి. ఆనందాన్ని నీ మాటలలో వ్యక్తపరుచు. మనస్సులో ఆనందాన్ని నింపుకో.

ఈతగాడు ఏ విధంగా నీటిలో తేలియాడుతూ ఈత కొడతాడో, అదే విధంగా ఆనంద కడలిలో తేలియాడు. రాత్రింబవళ్ళు ఆనందస్థితిలో ఉండు. బంధువులలో మరణం సంభవించినా, నీ ఇల్లు కాలిపోయినా, వేరే ఏ దుర్ఘటన జరిగినా నీ ఆనందభావనలో మార్పు రాకూడదు. ఈ అభ్యాసం చేత సర్వ దుఃఖాలూ, సకల క్లేశాలూ హరిస్తాయి. నీ వాక్కులలో ఆనందాన్ని ఒలికించు. మనస్సు ఎప్పుడూ ఆనందభావనలో ఉంచు. నీ బుద్ధిని ఆనందంపైనే కేంద్రీకరించు. నీవు ఆనందభావాన్ని పొందకపోయినా. నీ కల్పనా శక్తిచేత ఆ భావనను పొందు. కాల్పికమైన ఆనందం మంచి ఫలితాన్ని ఇస్తుంది. భగవత్ప్రాప్తికి దారి తీస్తుంది. ఈ అభ్యాసాన్ని ప్రతి జీవుడూ చేయవచ్చు. మనం ఆనందస్వరూపులం కాని వేరుకాదని గుర్తించాలి. ఆ భావన మనస్సులో స్థిరపడినప్పుడు అంతటా ఆనందాన్నే అనుభవించ గలుగుతాము.

-సశేషం

---

ది. 13-2011 ఆషాఢ పౌర్ణమి నుండి 12-8-2011 భాద్రపద పౌర్ణమి వరకు చాతుర్మాస దీక్ష సందర్భంగా కాళీవనాశ్రమంలో సత్సంగ సమావేశాలను ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో శ్రీమాతాజీవారు, గురు సోదర సోదరీమణులు, ఇతర భక్తులు ప్రసంగాలు చేస్తారు. ఈ సమావేశాలు సాయంత్రం 5-30ని॥ నుండి 7-30ని॥ వరకు జరిగి లఘు ప్రార్థనతో ముగుస్తాయి.

---

# శ్రీకృష్ణాష్టమి వేడుకలలో శ్రీమాతాజీ అనుగ్రహభాషణ

శ్రీకృష్ణాష్టమి వచ్చింది. శ్రీకృష్ణుని తలచుకోని వాళ్ళు ఎవరైనా బృందావనంలో ఉన్నారా? శ్రీకృష్ణుని బుట్టలో పెట్టుకుని యమునానదిని దాటుతున్న సన్నివేశాన్ని పూలతో బృందావనంలో ఎంత చక్కగా అలంకరించారో! చూసిన హృదయాలు పులకించిపోయాయి. ఆ బుట్టలో బుల్లోడు ఏమీ ఎరుగనట్లు పడుకొని అలవోకగా తన పాదాలను బయట పెట్టాడు. ఆ అవకాశం కోసమే ఎదురు చూస్తున్న యమునమ్మ తల్లి అలలతో శ్రీకృష్ణుని పాదాలను ప్రక్షాళన చేసుకుని తరించింది. ఆదిశేషుడుతన పడగలతో నీడ పట్టగా వసుదేవుడు నదిని దాటి నందుని ఇంట ప్రవేశించాడు.

శ్రీకృష్ణుని రాకకై దేవతలందరూ ఎదురు చూస్తున్నారు. రేపల్లెలో గోపికలూ ఎదురు చూస్తున్నారు. అయితే ప్రథమ దర్శనం ఎవరికి అయింది? ఎవరైతే శ్రీకృష్ణ నామాన్ని ధారగా ధారణ చేస్తారో ఆధార రాధ అయిపోతారు. శ్రీకృష్ణుని చిరుపాదాలను రాధ ప్రథమంగా దర్శించింది. ఆమె హృదయంలో ఆ పాదాలను ముద్రించుకుని మురిసిపోయింది. శ్రీగురుదేవులు ఈ సన్నివేశాన్ని తెలిపే కీర్తనను మనకు అందించారు.

**బిర బిర రాగదోయీ, మురళీధరా రావోయి ఒకసారి, ఇటు**
**రావోయి ఒకసారి**
**ముంగురులతో ముద్దులొలికే ముఖబింబమే వేయి వెన్నెలల పంట**
**ముల్లోకముల కది వెలుగు బాట ॥బిర బిర॥**

శ్రీగురుదేవులు తమ ప్రసాదంగా అనుభవాలను ఎంతో కొంత మనందరికీ అందించారు. అయితే ఆ ఆనుభవాన్ని పూర్తిగా పొందకే ఈ తికమకలు, మకతికలు. తారణహరుడు లోకోద్ధరణ కోసం దేవకీవసుదేవులకు పుట్టాడు. అంటే అది నిజమా? కాదు ఆవిర్భవించాడు. శ్రీమన్నారాయణుడు సాక్షాత్కరించి తాను దేవకి గర్భంలో పుట్టబోతున్నట్లు చెప్పాడు. కారాగారం అంతా కోటిసూర్యుల వెలుగుతో నిండిపోయింది. ఆ వెలుగే శ్రీకృష్ణుని రూపంలో దేవకి పంట పండింది. మనం కూడా దేవకి అవదూ! ఆ బుజ్జోడికి అమ్మ అవద్దూ? అందరూ అవచ్చు. దానికి స్త్రీ పురుష భేదం లేదు. బిడ్డకి అమ్మ దగ్గర ఉన్న చనువు తండ్రి దగ్గర ఉంటుందా? శ్రీకృష్ణుని ఆటపాటలు, ఆయన చేసే మారాము మన భావనలోకి తెచ్చుకుంటే దివ్యానుభూతి

కలుగుతుంది. శ్రీగురుదేవులు అటువంటి దివ్యానుభూతులను మనకు స్థిరాస్తిగా అందించారు. స్థిరాస్తి అంటే పొలాలూ అవీ. కాని అవి స్థిరంగా ఉంటున్నాయా? వాటికి కాళ్ళు వస్తున్నాయి. ఒక పేపరు రూపంలో (దస్తావేజు) ఎంతమంది చేతులు మారటం లేదు? కాని మన స్థిరాస్తి అది కాదు. మన తాత ముత్తాల కాలం నుంచి వచ్చిన 'భగవద్గీత'.

భక్తుని భగవన్నామం పై ఉండే ఆదరణ చాలు. ఆ నామం నామ రూపాన్ని చూపిస్తుంది. ఆ రూపం నిన్ను దివ్యానుభూతులలోకి తీసుకుని పోతుంది. ఆ రూపాన్ని చూసిన గోపికలు మైమరచిపోయారు. మీరందరూ ఒక్క క్షణం కనులు మూసుకొని గోపికలు దర్శించిన ఆ చిరుపాదాలను ఊహించుకోండి. భ్రూమధ్య స్థానంలో ఆ పాదాలను ముద్రవేసుకోండి. భ్రూమధ్యం పైన సహస్రారం ఉంది. దాని వల్లనే అన్ని తెలుసుకొనేది. శ్రీగురుదేవులు "ఆ తెలిని నేనురా! దానిని చూస్తే ఇక దేనిని చూడనక్కర్లేదో దానిని దర్శించండి'' అన్నారు.

శ్రీకులశేఖరాళ్వారులవారు ఇలా అన్నారు....

**నాస్థా ధర్మే నవసునిచయే నైవ కామోపభోగే**
**యద్యద్భవ్యం భవతు భగవన్! పూర్వ కర్మానురూపం**
**యేతత్ప్రార్థ్యం మమ బహుమతం జన్మజన్మాంతరేపి**
**త్వత్పాదాంభోరుహ యుగగతా నిశ్చలా భక్తిరస్తు॥**

"ప్రభూ! ధనం ఆర్జించాలి అనిగాని, అర్థం కూడ బెట్టాలనికాని, కామాలను అనుభవించాలనే కోరిక లేదు. పూర్వకర్మలను అనుసరించి ఏది ఎలా జరగాలో అలా జరుగుతుంది. కాని జన్మజన్మలకు నీ పాదారవిందాలపై నిశ్చల భక్తిని ప్రసాదించు.''

పరమాత్మ వస్తువు ఎంత వ్యాపకమో అంత సూక్ష్మం. **"సర్వహీన స్వరూపోZహం''** అని చెప్పారు శ్రీగురుదేవులు. వారు చెప్పిన మార్గంలో మనం నడుస్తున్నామా? ఆశాశ్వతమైన వాటికై వెంపర్లాడతాం. వాటిపై ఉన్న మమకారం బంధాన్ని తెస్తోంది. మనల్ని అధోగతిపాలు చేస్తోంది. ఇదంతా గురు అనుగ్రహం అని నమ్మితే శాంతి లభిస్తోంది. నూతిలో నీళ్ళు చేరటానికి బొక్కెన, చిన్న తాడు ఉంటే చాలు. అలాగే మనం తరించాలంటే ఆ చిన్నిపాదాలు చాలు!

-సశేషం

# సమర్థ సద్గురు నాధుని దివ్య చరిత్ర

(గత సంచిక తరువాయి)

- విజయేశ్వరానంద ప్రసాద్

పరశురామయ్యగారు ఆనందపడిపోతూ "ఎంత బాగా చెప్పారు బాబూ! చాలా బాగుంది. అందులో ఇంకొక పాయింటు కూడా ఉంది. చూశారా? పచ్చిగా ఉన్నప్పుడు మామిడికాయ కోయబోతే, త్వరగా ఊడిరాదు. గట్టిగా చెట్టుకు పట్టుకొని ఉంటుంది. బలవంతంగా ఊడలాగితే, ఏడుస్తున్నట్లుగా సొన కారుస్తుంది. అది కృత్రిమంగా పండవేసినా పండదు. ఎండిపోతుంది. అదే కాయను చెట్టుకే ఉండనిస్తే ఎండా, గాలీ పోసుకుని, చక్కని పండుగా మారుతోంది.



అలాగే సంసారంతో గట్టిగా పెనవేసుకున్న మానవుడు బలవంతంగా సంసారం నుండి దూరం కావాలని ప్రయత్నం చేస్తే, ఆ ప్రయత్నం ఫలించదు. సంసారంలో ఉంటూనే, సంసారబాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తూనే, ఆ లంపటంలో మాత్రం తగులుకొనక, తానాశ్రయించిన గురువు ప్రసాదించిన లక్ష్యార్థాన్ని చక్కగా సాధనచేస్తున్న మానవుడు, చెట్టుమీదే పండిన పండువలె, భక్తి వైరాగ్యములతో కూడిన జ్ఞాని అవుతాడు. కాయ పండిన తరువాత చెట్టుమీదనే ఉన్నా, పట్టు ఉండదు. వేలుతాకినా, గాలిసోకినా నేలకు రాలి పోతుంది. అలాగే సంసారంలో, అంటే గృహస్థుడుగా ఉంటూనే మానవుడు తరించవచ్చునని మన మహర్షులు ఆచరణపూర్వకంగా ఈ సత్యాన్ని ఋజువు చేస్తూ తమ జీవితాలను సార్థకం చేసుకుని, మనందరికీ మార్గదర్శకులైనారు." అని శ్రీ పరశురామయ్యగారు బదులు పలికేవారు.

ఎప్పుడైతే ఈచర్చ ప్రారంభమయిందో, అప్పట్నించీ పప్పూ, నెయ్యీ కలిపిన అన్నం విస్తట్లోనే ఉండిపోయేది, తీసుకున్న ముద్ద చేతిలోనే ఉండేది. పప్పులో నంజుకోవటానికి వాళ్ళకు వడ్డిద్దామని తెచ్చిన ఊరిమిరపకాయలు చుక్కమ్మగారి చేతిలో అలాగే ఉండిపోయేవి. విన్నంత సేపూ విని, కునుకువచ్చి తలుపుకు ఆనుకున్న చుక్కమ్మగారు తలుపుకు ఆనుకుని అలాగే

ఉండిపోయేది. కునుకు నిద్రగా మారి, తల గుమ్మానికి ఆనించి ఆమె నిద్ర పోయేది. అంతలో తెల్లవారిపోయేది.

శ్రీ బాబు ఆరోజులలో సామాన్యంగా, ఏ అర్థరాత్రి వేళకో వచ్చేవారు. కాలవగట్టు మీదనుంచి యనమదుర్రు వచ్చే వంతెన పైకి ఎక్కగానే బ్యాటరీలైటు వేసేవారు. శ్రీ బాబు రాకకోసం గంగరాజు పాకలో నిరీక్షిస్తూ కూర్చునే పరశురామయ్యగారికి ఆ లైట్ ఒక సంకేతం. ఆ సంకేతం అందుకోగానే పరశురామయ్యగారు ఆనందంగా లేచి, బయటకు వచ్చి, బాబు రాగానే "రండి బాబూ"అని లోనికి తీసుకువెళ్ళేవారు. ఇక తత్త్వ విచారణలో పడిన వారిద్దరూ, తెల్లవారిపోయిన విషయం కూడా గమనించే వారు కాదు.

అప్పట్లో శ్రీ బాబు మాట బాగా నంగిగానే ఉండేది. అందరికీ త్వరగా అర్థమయ్యేదికాదు. కాని అటువంటి మాటలతోనే, ఎటువంటి జటిలమైన వేదాంత సమస్యలనైనా క్షుణ్ణంగా చర్చించి, సులభంగా చిక్కువిడదీసి, తిరుగులేనివిధంగా పరిష్కరించేవారు. ఎందరెందరో ఉద్దండ పండితులనుకూడా అవాక్కులను చేసేవారు. ఆ సమయాలలో శ్రీ పరశురామయ్యగారి ఆనందం హద్దులు మీరేది. శ్రీ బాబును గాఢాలింగనం చేసుకుని ఆనందబాష్పాలతో తడిపేస్తూ " భేష్! ఎంత బాగుంది బాబూ! ఇది నీకే చెల్లు" అని బోసినోటితో పకపక నవ్వేవారు. అంతేకాదు; అసూయాగ్రస్తులైన ఆ పండితుల "దిష్టి" దోషం తగలకుండా, వాళ్ళు వెళ్ళిపోగానే, పరశురామయ్యగారే స్వయంగా "దిష్టి" తీసేవారు. శ్రీ బాబుతో చర్చలకోసం వచ్చేవాళ్ళను పరశురామయ్యగారు ఎక్కువగా ప్రోత్సహించేవారు కాదు. పూజలో ఉన్నారనో, ధ్యానంలో ఉన్నారనో చెప్పిపంపేవారు. ఈ పసివాని అద్భుత సమాధానాలకు, అతిలోక చర్యలకు ఆ వచ్చినవారు ఎంత అబ్బురపడి పోతారో, ఏ దృష్టిదోషం తగులుతుందో అని ఆయన భయం. అంత ప్రేమగా అబ్బురంగా పరశురామయ్యగారు శ్రీబాబూజీని చూసుకునేవారు.

పరశురామయ్యగారి తండ్రిగారైన శ్రీరాములుగారిశిష్యులు, వారిసంప్రదాయానికి చెందినవారెందరో పండిత ప్రకాండులు ఉన్నారు. బెజవాడలో శ్రీరాములుగారు స్థాపించిన శ్రీరామానందాశ్రమంలో వారందరూ తరచుగా సమావేశమవుతూ ఉండేవారు. తమ సహచరుడు, గురుపుత్రుడు అయిన పరశురామయ్యగారి పట్ల వారికి చాల అభిమానము, గౌరవము ఉండేవి. కాని, పరశురామయ్యగారు ఉన్నట్లుండి ఇలా కులము గోత్రము

తెలియని, “విద్యాగంధమే” లేని, ఊరూ పేరూ తెలియని ఒక “అర్భకుని”తో, ఇంత సన్నిహితంగా సంచరించటం వాళ్ళెవరికీ ఇష్టంలేదు. పైగా తమ సాంప్రదాయ సంబంధమైన ఆరాధనాది కార్యక్రమాల కంటె కూడా, పరశురామయ్యగారు ఆ “కుర్రవాని”తో కాలంగడపటానికే ఎక్కువ ఇష్టపడుతున్నారనే సత్యం వారికి మింగుడు పడలేదు. అక్కడికీ అవకాశం దొరికినప్పుడల్లా వారు పరశురామయ్యగారిని హెచ్చరిస్తూ, మరలించే ప్రయత్నం చేసినా, పరశురామయ్యగారికి శ్రీబాబు ఎడల ఉన్న ఆత్మీయతను సడలించ లేకపోయారు.

వారిలో కొందరు ఉద్దండ పండితులు ఒకసారి శ్రీ పరశురామయ్య గారింటికి వచ్చారు. అప్పుడు శ్రీ బాబు పూజలో ఉన్నారు. ఆ పండితులు శ్రీ బాబుతో కొంతసేపు గోష్ఠి జరుపుతామని శ్రీ పరశురామయ్యగారితో అన్నారు. శ్రీ పరశురామయ్యగారు వద్దని, అది అనేక మనస్తాపాలకి దారితీస్తుందని, “నెమ్మది నెమ్మదిగా శ్రీ బాబు తత్త్వం మీరే తెలుసుకోగలుగుతారు” అని, వారిని వారింప జూశారు. కాని వాళ్ళు ఎలాగైనా శ్రీ బాబును వాదంలోకి దింపి ఆయన ‘చేతగానితనాన్ని’ పరశురామయ్యగారి ఎదుట నిరూపించాలని, శ్రీ బాబు “అసలు సరుకు” బయటపెట్టాలని వచ్చారు. పరశురామయ్యగారు నొచ్చుకుని “అయ్యా! వారి సంగతి మీకు తెలియదు. ఆయన అసాధారణ ప్రజ్ఞాశాలి. ఆత్మజ్ఞాననిధి. ఆయనను మీరు ఢీకొనే ప్రయత్నం అవివేకం. **‘వచ్చెడివాడు ఫల్గుణుడవశ్యము గెల్తుమనంగరాదు*’** ఇప్పటికైనా మీ ప్రయత్నం విరమించుకోండి. మీరు యీ ప్రయత్నం చేసి అవమానం పాలవటం నేను చూడటానికి యిష్టపడను. నేను తప్పుకుంటాను” అని పరశురామయ్యగారు వెళ్ళిపోయారు.

* భారతంలో ఉత్తర గోగ్రహణ సమయంలో, బృహన్నల సారధ్యంలో ఉత్తర కుమారుడు తమపై యుద్ధానికి రావటం చూసిన కౌరవులు గర్వోన్మత్తులై, “వాళ్ళను జయించి పరాభవం పాలుచేస్తా”మని ప్రగల్భాలు పలుకుతున్నారు. వివేకవంతుడు, సత్యనిష్ఠుడు, అయిన పితామహుడు వాళ్ళను హెచ్చరిస్తూ “వస్తున్నవాడు పేడి అనుకుంటున్నారు గాని అతడు దుర్జయుడైన అర్జునుడు, జాగ్రత్త!” అని పలికిన మాటలివి. ఆ పితామహుని మాటను పెడచెవినిపెట్టి, కౌరవులు అర్జునునిచేతిలో చిత్తుగా ఓడిపోయారు.

- సశేషం.

# మౌన ధ్యాన శిబిరం

(గత సంచిక తరువాయి) - రమణ ప్రసాద్

విఘ్నేశ్వరుడి పెళ్ళికి అన్నీ విఘ్నాలే అన్నట్లుగా ధ్యానానికి కూర్చుని మనస్సు నిలవకపోతే ఎవరితో మొరపెట్టుకొనేది?

గురుదేవులు అనేవారు, "భగవంతుని సర్వవ్యాపకత్వానికి గుర్తు ఏమిటి? కాలులో ముల్లు గుచ్చుకుంటే ఎలా తెలుస్తోందో, అలాగే భగవంతుడు సర్వవ్యాపకుడు. నీ వీపు నీకు కనిపించదు. కాని దోమ వాలితే చెయ్యి వీపుమీద వేస్తావు.

గురుదేవులతోవాకింగ్‌కు వెళ్తే నయాపైసా ఖర్చు ఉండదు. నేను "కాస్త కూల్‌డ్రింక్ తాగండి" అని అంటే, " ఎందుకమ్మడూ! ఇంటికి వెళ్ళి మజ్జిగ తాగవచ్చు."అనేవారు. బుడగల గురించి ఇలా అనేవారు "చూశారా? ఈ బుడగ ఊదితే ఎంత బాగుందో? ఈ బుడగలాంటిదే మన జీవితం. ఎప్పుడు 'ఠప్' అంటుందో తెలిసికోలేం." భగవంతుని గురించిన అనుభూతులు వ్యక్తిగతమైనవి. **'మనసా ఎటులోర్తునే నా మనవిని చేకొనవు'** అన్నారు శ్రీ త్యాగరాజస్వామి.

కోర్కెలు చిత్తంలోవస్తాయి. కాని నిర్ణయించేది చిత్తం వెనక ఉన్న బుద్ధి.

**మనస్తే పాదాబ్జే నివసతు వచస్తోత్రఫణితౌ**
**కరశ్చాభ్యర్చయాం శ్రుతివపి కథాకర్ణన విధౌ**
**తవధ్యానే బుద్ధిర్నయన యుగళం మూర్తి విభవే**
**పరగ్రంథాన్ కైర్వాపరమశివ! జానే పరమతః**

నా మనస్సు సదా నీపాదలపైనను, నా వాక్కు నిన్ను స్తోత్రం చేయటంలోను, నా చేయి నీ పూజ చేయటంలోను, నా చెవులు నీ చరితములను వినుటలోను, నా బుద్ధి నీ ధ్యానంలోను, నా దృష్టి నీ వైభవాన్ని తిలకించటంలోను స్థిరమై ఉంటుంది. వేరే గ్రంధాలు మతాలు నేనెరుగను.

**గురుమూర్తిం స్మరేన్నిత్యం**
**గురుర్నామ సదా జపేత్**
**గురురాజ్ఞా ప్రకుర్వీత**
**గురోరన్యం న భావయేత్ ॥**

స్మరణ దేనితో చెయ్యాలి? వాక్కుతో చేసేది స్మరణ కాదు. భగవంతునిపై మనస్సు చేర్చాలి. చూడండి కనురెప్పలు వాటంతట అవే పడతాయి. శ్వాస దానంతట అదే వస్తూ పోతూనే ఉంటుంది. మనస్సును ప్రపంచ విషయాలపై పెడితే దుఃఖం. భగవంతునిపై పెడితే అది స్మరణ.

**(ఆ)వేదన చెందుచు సడలి కృశించి**

**సాధన చేయక సాధ్యము కాదని ।**

సడలి కృశించి పోతోంది నీ శరీరం. మనస్సును కృశింపచెయ్యి - కబంధుడిలాగా. మనస్సును విషయాలమీద పోనీయక విశ్వనాధుడిపై నిలుపు. హృదయంలో ఉన్నవాడే గురుదేవుడు. నీకు ఏ రూపం ఇష్టమో దానిపై ధ్యానం చెయ్యి. నీకు తోడుగా గురుదేవులు మన వెంటనే, మనతోనే ఉన్నారు, ఉంటారు.

**నిష్కామముతో నిశ్చల మనసుతో**
**ఆర్తితో బహు భక్తి భావనతో**
**ప్రేమాశ్రువులే పూలుగ చేసి**
**ప్రభు శ్రీ శంకరు పూజ సలుపుమా ।**

ఆర్తి అంటే 'తితీక్ష' అంటే ఆర్తితో పరమాత్మను ధ్యానించాలి. అటువంటి ఆర్తి ఎక్కడ ఉంటుందో భక్తి అక్కడే ఉంటుంది. భక్తి భావనతో చేస్తే ప్రేమాశ్రువులు జాలువారుతాయి. ప్రేమతో "నేను ఏమీ తీసుకు రాలేక పోయాను'' అంటే, " చాలమ్మా! నువ్వు వచ్చావు చాలు' అనేవారు శ్రీ గురుదేవులు. ప్రేమ ఎలాంటిదో చూపగలవా? పోనీ రాయగలవా? గురుదేవులు చూపిన అనంత ప్రేమను చూపించగలమా?

వేదం గ్రంథం నుంచి చదివి నేర్చుకోవాలి. కానీ గురుదేవులతో కాశీ వెళ్ళినప్పుడు ఉక్కడ రుద్రం చదువుతుంటే నేను అలవోకగా చదివేశాను. నాకు వినికిడితోనే అది వారిదయ!

భావన ఉంటేనే అనుభూతి వస్తుంది. అమృతమనే సముద్రంలో కూర్చుని ఉన్నా భావన లేకపోతే ప్రయోజనంలేదు. ఎందుకని? ప్రపంచవాసన అనే జిడ్డు పట్టించుకున్నావు. వివేకదృష్టిని అలవరచుకో.

ముట్టుకుంటే అంటుకుంటుంది,అంటుకుంటే పట్టుకుంటుంది, పట్టుకుంటే కుట్టిపడుతుంది ఏది? ప్రపంచ వాసన అనే జిడ్డు. నిశ్చలమైన మనస్సుతో ప్రభువును ధ్యానించు. దిగులు పడకు అన్నారు. అహంకారం వద్దు అన్నారు. సమభావనతో ఉంటే సాధన ఫలిస్తుంది అన్నారు.

**నీమము తప్పక నీ దోషములను**
**ప్రభుకెరించిన రక్షించునుగా**
**నీలకంఠుడే నిను కడతేర్చును**
**ఒకడే ప్రభువని నిక్కము నెరుగుమా**

ఒక్కడినే ఆశ్రయించు. నీ మనస్సు అద్దంలా చేసుకో అప్పుడు ఆయన బోధించే అనంతతత్త్వం నీకు అవగతమవుతుంది.

-సశేషం

# సద్గురువే భగవంతుడు

-సుషుమ్న ప్రసాద

ద్వాదశ వైష్ణవ ఋషి పుంగవులలో ఒకనిగా ప్రసిద్ధి చెందిన మధురకవి, సత్యగురువునకు సర్వసమర్పణ మొనర్చుకున్న శిష్యునిగా, హిమాలయ శిఖరానికి ఎదిగినట్లు అతని జీవితము నిరూపిస్తున్నది. మధురకవి ఆళ్వారులలో ఉత్తమ జాబితాలో చేరిన మహానీయుడు.

తన సత్యగురుదేవుడైన 'నమ్మాళ్వారు' పట్ల మధురకవి భక్తి యెంత గాఢమైనదంటే, భగవంతుని కూడా ప్రక్కకు పెట్టి, తన గురుమూర్తిని స్తుతిస్తూ గానము చేయటానికి మాత్రమే అంగీకరించాడు. ఆయన రచించిన పదిపాసురములు 'నలయుర' దివ్య ప్రబంధములో భాగమైనది. (ఆళ్వారులు రచించిన నాలుగువేల పద్యములు) ఆ పదిపాసురములు 'నమ్మాళ్వారు' అతని దివ్య కృపను కీర్తిస్తూ వ్రాసినవే. అలా మధురకవి వైష్ణవ సంప్రదాయములో గురుమూర్తి పట్ల శరణాగత భక్తితో, గురుదేవుడు మాత్రమే జీవాత్మను జనన మరణములనే చక్రము నుండి విముక్తి నొందించి, పరమాత్మలో లయము చేయగలడని విశ్వసించాడు.

దక్షిణ తమిళనాడులోని తిరుక్కొలూరు అనే గ్రామంలో జన్మించిన మధురకవిని కృష్ణ పరమాత్మ సమకాలికుడుగా నమ్ముతారు. కృష్ణ పరమాత్మ అవతారం చాలించి, వైకుంఠానికి చేరిన తరువాత మధుర కవి ఉత్తర భారతదేశంలో రాధాకృష్ణులకు సంబంధించిన పవిత్ర క్షేత్రములన్నిటినీ దర్శించాడు.

ఒకరోజు మధురకవి అడవి మధ్యలో ఉండగా దక్షిణకాశిలో ఒక దివ్య కాంతిని సందర్శించాడు. ఆ జ్యోతి యొక్క మూలాన్ని తెలుసుకోవాలనే ఆకాంక్షతో మధురకవి దక్షిణదిశగా ప్రయాణం చేశాడు. అతను 'తిరుకుగూరు' అనే గ్రామం చేరేటప్పటికి, ఆ జ్యోతి అదృశ్యమైంది. ఈ విషయం గురించి ఆ గ్రామీణులతో మాట్లాడుతుండగా, అక్కడ ఒక మహాయోగి విష్ణు ఆలయమునకు సమీపాన ఉన్న చింతచెట్టు క్రింద యోన్నో సంవత్సరములు నుండి తపస్సు చేస్తున్నాడని చెప్పారు. వెంటనే అక్కడకు వెళ్ళి ప్రగాఢమైన యోగసమాధిలో యోగముద్రలో ఉన్న యోగి పుంగవుణ్ణి చూశాడు.

ఆ యోగి యెలాంటి స్థితిలో ఉన్నాడో పరీక్షించదలచి, మధురకవి చిన్నరాయి అతనిపైకి విసిరాడు. వెంటనే యోగి తన యోగముద్ర నుండి కన్నులు తెరిచాడు. మధురకవి అతనిని "ఒక క్షయమయ్యే వస్తువు నుండి, ఒక చిన్న బీజము బయటకు వస్తే అది యేమి తింటుంది? యెలా పెరుగుతుంది?" అని ప్రశ్నించాడు. వెంటనే ఆ యోగి "ఆ చిన్న వస్తువు ఆ క్షయ పదార్థమునందే నివసించి, అక్కడే వృద్ధి చెందుతుంది" అన్నాడు.

మధురకవి ఆ యోగి సమాధానములోని పరమమైన అంతరార్థమును గ్రహించి, అతను నమ్మాళ్వారు తప్ప మరియొకరు కాదని గ్రహించి, సత్యగురువు అన్వేషణకు తాను చేసిన శోధన సఫలీకృతమైనదని ఆనందించాడు.

ఈ మహాత్ములిరువురి మధ్యన జరిగిన ప్రగాఢమైన సంభాషణ మానవుని ఉనికి యొక్క రహస్యమును, అందలి సత్యమునమకు ప్రతీకయని వైష్ణవ పండితులు యెంతో ఆరాధించారు.

ఇందులో అంతరార్థమేమిటంటే మధురకవి జనన మరణములనే చక్రములో ఉన్న సూక్ష్మాతిసూక్ష్మమైన అణువులాంటి ఆత్మ యొక్క (జీవాత్మ) అనుభవ మేమిటని ప్రశ్నించాడు. దానికి నమ్మాళ్వారు యిచ్చిన సమాధానము సుఖ దుఃఖములు, జనన మరణములు ఉపాధికి సంబంధించినవి కాని ఆత్మకు కాదు. ఆత్మ శరీరమునకు విలక్షణమైనదని గ్రహించి అనుభూతి పొందితే, ద్వంద్వముల నుండి విముక్తిని పొందుతాడు అని.

-సశేషం

**వనవాసం వెళ్ళమన్న కైకతో శ్రీరామచంద్రుడు "అడవులలో నన్ను నేను కాపాడుకోవటమే మీరు నాపై ఉంచారుగాని, సర్వభువన భారాన్ని తమ్ముని తలపై మోపారు తల్లీ! మీ పనులను తరచి చూస్తే నా మీద మీరెంత పక్షపాతం చూపించారో నాకు విచిత్రంగా ఉందమ్మా!" అన్నాడు.**

**- భోజరాజు రామయణ చరిత్ర**

# అమెరికాలో మాతాజీ బోధ

(గత సంచిక తరువాయి)

-పరాశర ప్రసాద్

శ్రీమాతాజీ భక్తులకు బోధ చేస్తూ పూజ ఎంతసేపు చేయాలి? చిత్త శుద్ధి లేని పూజ ఎన్ని గంటలు చేసినా నిష్ప్రయోజనమే. మన వేమనగారు అదే చెప్పారు. "చిత్తశుద్ధి లేని శివపూజలేలయా" అన్నారు. సినిమాగాని, టి.వి. గాని చూడటానికి ఎన్నిగంటలైనా విసుగూ విరామమూ అవసరం లేకుండా చూడగలుగుతారు. కాని పూజలో కూర్చోమంటే పూజ చేయించే వ్యక్తిని ఎంత సమయం పడుతుంది అని ప్రశ్నిస్తారు. ఆఫీసుకి అర్జంటుగా వెళ్ళాలి తొందరగా ముగించమని చెప్పటానికి కూడా వెనుకాడరు. అదే సమయంలో ఆరోగ్యం క్షీణించిందనుకోండి అలాగే ఆఫీసుకు వెళ్తారా? శెలవు పెట్టకుండా ఉంటారా?

ప్రతి మానవుడికి కొన్ని వాసనలుంటాయి. కొందరికి సినిమా చూడటమనేది వాసన. కొంతమందికి ఎవరితోనైనా వ్యర్థ ప్రసంగాలు చేయుట మనేది కూడా వాసనే. వంటలూ వార్పులు గురించిన చర్చ వస్తేఎప్పుడో వాళ్ళ పెద్దమ్మ చేసిన కూర గురించిగాని, పిండివంట గురించిగాని చర్చించక మానలేరు కదా అదే వాసన. ఆ చర్చలో మునిగిపోయి కాలాన్ని మరచిపోతారు. కానివిపోనివి కర్మలుచేసి కాలుని బారిన పడవద్దని గురుదేవులు హెచ్చరిస్తున్నారు.

మానవుడిలో వాసనలు మంచివికావచ్చు, చెడువి కావచ్చు. విషయాదుల వైపుకు మనస్సు మరల్చే వాసనలు దుర్వాసనలు. సద్గురుదేవుల స్మృతుల గూర్చిన చింతనవైపుకు మనస్సు మరలితే అది సువాసనని పెంపొందింప జేస్తుంది. మానవ జీవితానికి పరమార్థం తానెవరో తాను తెలుసు కోవటానికి ప్రయత్నించాలి. దానికి భిన్నంగా విషయ చింతనలు చేస్తే కాలుని ఆహ్వానాన్ని మన్నించక తప్పదు.

మాయ అనేది భ్రమ. మాయ మాయ అని ఎంత జపం చేసినా దానిని అధిగమించటం దుర్లభం. నారాయణుని దివ్య ప్రేమని అందుకోగల్గితే మాయ నీ చెంతకు రాదు.

మానవుడు ప్రపంచంలో ఎన్ని కష్టాలు సంభవించినా వాటిని సహించి, విషయాదులవైపు మరలుతాడు. ఎంత ధనమైనా వెచ్చిస్తాడు. కాని భగవత్కార్యం వచ్చేసరికి, పూజకి ఇంత ఖర్చు పెట్టాలా! ఇన్ని గంటలు కూర్చోవాలా!

ఇంతకాలం వినియోగించాలా! అని చింతిస్తాడు. దైవకార్యానికి వినియోగించిన కాలమే సత్యకాలంలో జమ అవుతుందన్న విషయాన్ని గుర్తించడు. దైవకార్యానికి వినియోగించిన ధనం త్యాగం క్రింద పరిగణింప బడుతుంది.

నువ్వు ఆర్జించిన ధనం నీ వెంట రాదు. నువ్వు చేసిన త్యాగమే నీకు సద్గతిని ప్రసాదిస్తుంది. మానవుడు ప్రపంచంలో బ్రతకనేర్చినవాడు. కాని మానవుడు బ్రతికేది ప్రపంచంలో ధనార్జన కోసంకాదు. కీర్తి ప్రతిష్ఠల కోసంకాదు. ఉన్నత పదవుల కోసం అంతకన్న కాదు. పోనీ బ్రతికేది చివరికి చావటం కోసమా! ఆలోచించండి.

సద్గురుమూర్తిని ఆశ్రయించి, ఆయన అనుగ్రహానికి పాత్రుడై నువ్వు సాధించ వలసినది ఏమిటి? చావులేని స్థితిని సాధించటానికిగాని, చావటానికి కాదుకదా! సద్గురు మూర్తి అవతరించి వచ్చినది, దాన్ని ప్రసాదించటానికేగా! నీ జీవితానికి అవసరమైన సత్యమేమిటో గుర్తింపజేయటానికి ఆయన అవతరించారు.

శ్రీకృష్ణపరమాత్ముడు పాండవుల సఖుడై, బావమరిదియై సంచరించి వారిని రక్షించాడు. అది వారి భాగ్యము. అలాగే మన గురుదేవులు మనకి మాత్రం ఏం లోటు చేశారు? ఎంత ధనాన్ని ఆర్జించినా త్యాగం ఉంటేనే అది సఫలీకృతమవుతుంది. దానిని మన జీవితంలో ఎంతవరకు సద్వినియోగం చేసుకుంటున్నామో ఆలోచించండి.

త్యాగం ఎక్కడ ఉంటే ఆక్కడ మహాత్ముల దృష్టిమాత్రం చేత అక్షయ మవుతుంది. ఇది మాత్రం సత్యం. మహాత్ముల స్మరణతో ఏ పని ప్రారంభించినా అది సఫలీకృతమే అవుతుంది.

బంగారం ఎంత ఉన్నా, ఆభరణంగా మారినప్పుడే అది సద్వినియోగ పడుతుంది. అలాగే మానవుడు తాను ఎంత ఉన్నత పదివిలో ఉన్నా, ఎంత భాగ్యవంతుడైనా, ఎన్ని విద్యార్హతలు కలిగి ఉన్నా, ఎంత వివేకవంతుడైనా ప్రపంచానికి వినియోగపడేలా మలుచుకున్నప్పుడే సంఘానికి ఆభరణమై ప్రకాశిస్తాడు. దానిని సాధించటానికి నిన్ను నువ్వే సంస్కరించుకోవాలి. అదే సాధన.

-సశేషం




(గత సంచిక తరువాయి) -రమణ ప్రసాద్

"అటు చూడండి ఉద్ధవా!" రాధ అకస్మాత్తుగా ఉద్ధవుని దృష్టిని అటు మరల్చుతూ అన్నది... అక్కడ ఒక అశ్వత్థ వృక్షం క్రింద కాళింది ప్రవాహంతో నున్నగా మారిన ఒక శిల ఉండటం చూశాడు ఉద్ధవుడు.

"ఏ రోజు మీరందరూ అక్రూరునితో యజ్ఞంలో పాల్గొనటానికి మధుర వెళ్ళారో, ఆ మరునాటి రాత్రి ఇక్కడే ఈ చెట్టు ఆకుల మాటునే, ఈ శిల మీద... కృష్ణుడు ఇక్కడే కూర్చుని ఉన్నాడు... ఈ విధంగా... "ఇక్కడ చూడండి..." అని రాధ ఉద్ధవుని చేయి పట్టుకొని నడిచింది.

ఉద్ధవుడు విస్ఫారిత నేత్రాలతో చూస్తున్నాడు..... ఆమెతో పాటు నడుస్తున్నాడు... కృష్ణుని దేహాన్ని ప్రభాస క్షేత్రంలో పంచభూతాలకు అర్పించాను అన్నాడు అర్జునుడు. ఈమాట అర్జునుడే ఉద్ధవునితో స్వయంగా చెప్పాడు. పంచభూతాలలో విలీనమైన దేహం తిరిగి ఇలా దృశ్యమానమవుతుందా? రాధ అన్నది నిజమే.... కృష్ణుడు ఈ శిలమీద కూర్చున్నాడా? ఉద్ధవుడు కళ్ళు మూసుకొన్నాడు....

అక్రూరునితో కంస సామ్రాట్టు యజ్ఞానికి వెళ్ళటానికి తత్పరుడై గోకులంలో అందరి వద్ద సెలవు తీసికొన్నాడు. కదంబవృక్షం నుంచి తన ప్రియమైన ధేనువు వరకు అన్నిటిపైన తన ప్రేమను, కరుణను కురిపించాడు. ఒక్క రాధకు తప్ప! ఆరోజంతా రాధ కృష్ణునికి ఎక్కడా కనిపించలేదు.

మర్నాడు ప్రాతఃకాలం కృష్ణుడు బయల్దేరనున్నాడు. ఎంతో రాత్రి గడిచింది. గోకులం ప్రశాంతంగా ఉంది. యమున కూడ అలసి సొలసి నెమ్మదిగా ప్రవహిస్తోంది. అప్పుడు కృష్ణుడు రాధ వద్ద సెలవు తీసుకోవటానికి ఇక్కడ... ఈ అశ్వత్థ వృక్షం వద్దకు ఎదురుగా కాళిందీ నది ప్రవహిస్తున్న చోటుకి వచ్చాడు. రోజంతా ఎవరికంట పడకుండా అశ్రుపూరిత నేత్రాలతో రాధ సాయంత్రంనుండి అక్కడ కృష్ణుని కోసం ప్రతీక్ష చేస్తోంది. ఈ ఎడబాటు ఆమె ఎన్నడూ ఊహించనిది.... రాధ దానికి సిద్ధంగా లేదు... ఏ క్షణంలో

కృష్ణుడు రాధతో... "రాధా నేను వెళుతున్నాను!" అంటాడో ఆ క్షణంలో బ్రహ్మాండం బద్దలవుతుంది... తాను కూడా చిన్నాభిన్నంగా అయిపోతుంది...

కాని ఆ విస్ఫోటం జరిగే క్షణాన్ని రాధ రాకుండా చూడాలని చూస్తోంది. కాని ఆ క్షణం రానే వచ్చింది! అర్ధరాత్రి రాధ వద్ద సెలవు తీసుకోవటానికి కృష్ణుడు ఇక్కడికి వచ్చాడు.

"రాధా!" ఎంతో స్వస్థతతో ప్రశాంతంగా మృదువుగా అన్నాడు "ప్రాతః కాలంలో మధురకు ప్రస్థానం చేస్తున్నాను... గోకులం అంతా నాకు వీడ్కోలు ఇచ్చింది... ఇక నువ్వు కూడా... రాధా నువ్వు కూడా...."

"వీడ్కోలు ఇవ్వాలా?" రాధ రెప్ప ఆర్పకుండా కృష్ణుణ్ణే చూస్తోంది.

"అవును రాధా! జన్మకర్మలకు అధీనులం కావల్సిందే కదా!"

"కర్మ చక్రం గురించి నాతో ఏమీ చెప్పకు కృష్ణా!" అంది రాధ. "దాని కోసం రాధ కృష్ణునికి వీడ్కోలు ఇవ్వటం అనివార్యమా? రాధ మీకు వీడ్కోలు ఇవ్వలేదు అన్న విషయం తెలియదా జనార్దనా?"

"తెలుసు రాధా! నా మధురా గమనం కూడా సాధారణ విషయం కాదని కూడా తెలుసు..."

"అంటే..?"

ప్రతి సంబంధమూ కర్మాధీనం రాధా...! జీవి- నిర్జీవి, శరీరి- అశరీరి, స్థూలం-సూక్ష్మం - ఇవన్నీ కాలుని అధీనమై ఉన్నాయి. అందరూ అంతం కావాల్సిందే. ఇది నిశ్చితం స్థూలం సూక్ష్మం అన్నీ సమాప్తమయిపోతాయి." కృష్ణుడు చెబుతూ పోతున్నాడు "ఈ సమాప్తిని సహజంగా తీసుకోవటం - మన ధర్మం."

మానవ ధర్మం స్వీకరించిన తరువాత కూడా ఒక ధర్మాన్ని ఆచరించటం మిగిలి పోతుంది కృష్ణా! ఆ ధర్మమే కృష్ణునికి వీడ్కోలు ఇవ్వకుండా రాధను ఆపుతోంది."

"రాధా!" మధురా గమనం తరువాత గోకులానికి నేను తిరిగి రావటం భవిష్యత్తులో రాసిపెట్టిలేదు! ఇక్కడ వీడ్కోలు తీసుకొన్న తరువాత అన్ని బంధాలు... ఈ సృష్టి... ఇవన్నీ కృష్ణుని జీవితం నుంచి తొలగి పోతాయి...

"కృష్ణా!" రాధ మొదటిసారిగా విచలితమవుతూ అంది. "స్వయంగా మిమ్మల్ని.... కృష్ణుణ్ణి గోకులం నుంచి దూరం చేసే భవిష్యం..."

అవును రాధా! అదే జరగబోతోంది! భవిష్యత్తును ఎవరు

మార్చగలరు? రాధాకృష్ణుల సంబంధం కూడా ఈ క్షణంలో...ఇప్పుడే...ఆగిపోతుంది. ఈ సంబంధానికి పూర్ణ విరామం! ఇక కృష్ణుడు ఎన్నటికీ రాధను కలవడు. యుగధర్మం సంకేతం ఇదే. నాకు వీడ్కోలు ఇవ్వు..." అన్నాడు కృష్ణుడు.

ఏ భవిష్యత్తును కృష్ణుడు కూడా దాటలేడో, ఆ భవిష్యత్తును తెలుసుకోవటం రాధకు కూడా అసంభవం. "కాని...కాని...సంబంధాలకు పూర్ణ విరామం వచ్చే ఘడియలో నాలో ఒక కోరిక కలిగింది కృష్ణా.... ఈ వాసన నుండి నేను ముక్తురాలను అవలేకపోతున్నాను కృష్ణా?"

"ఆ కోరిక ఏమిటి రాధా? ఏమిటి నిన్ను బాధిస్తున్నది?"

భావోద్వేగంతో రాధ "కృష్ణా" ఆమె కంఠస్వరం సామాన్యంగా ఉంది. "మిమ్మల్ని ఆపటం ఎలా?...అవును భవిష్యాన్ని ఎవరు ఆపగలరు...ఈ కలయిక అంతిమ ఘడియలో ఒకే ఇచ్ఛ ఉంది కృష్ణా..! నన్ను...నన్ను... మీ చరణాలపై శిరస్సును ఆన్చి కన్నీరు కార్చనీ...అంతే!...ఇంక ఈ రాధ అశరీరి అయిపోతుంది...కృష్ణుని నుంచి ఏదీ వేరు చేయలేదు."

కృష్ణుడు నవ్వాడు... రాధ కనురెప్ప ఆర్పకుండా చూస్తోంది.

ఆకాశం మధ్యగా చంద్రుడు కాళిందిలో ప్రతిబింబిస్తున్నాడు. ప్రాతః కాలపు చల్లటిగాలులు వీచటం ఆరంభమయ్యాయి.

ఏమీ మాట్లాడకుండా కృష్ణుడు శిలపై కూర్చున్నాడు... రాధ కృష్ణుని చరణాలపై వ్రాలింది... ఇది మొదటి స్పర్శ. దేహధారి కృష్ణునితో రాధ కృష్ణుని చరణాలపైన... రాధయొక్క స్పర్శ...ఆమె కన్నీటితో కృష్ణుని పాదాలను తడపటం... మానవ స్నేహాన్ని మొదటిసారిగా అభివ్యక్తం చేయటం.... కృష్ణుని పెదవులపై మందహాసం... నెమలి పింఛం గాలిలో ఆడుతోంది. ఎన్నో సంవత్సరాల తరువాత కాలగర్భంలో... హిరణ...కపిలా నదీ సంగమ స్థానంలో రాబోయే రోజుకి ఇప్పుడే అంకురార్పణం కాళింది తీరాన అయింది... జరను నిమిత్తంగా చేసికొని... కాలుని బాణం కృష్ణుని దేహంలో ఏ భాగంలో గుచ్చు కుంటుందో అది కూడా నిర్ణయమైపోయింది.... -సశేషం

Printed, Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL